ప్రజాశక్తి

శనివారం 4 మే 2024 · 8 పేజీలు





ఎన్‌టిఆర్ · కృష్ణా

బిజెపి పాలనలో రైళ్లు రద్దు

- మచిలీపట్నం-విశాఖ రైలు నిలిపివేత
- వారానికి ఒక్కరోజుకే తిరుపతి రైలు పరిమితం
- విశాఖ ప్రయాణీకులకు బస్సులే దిక్కు
- సామాన్య, మధ్య తరగతి ప్రయాణీకులపై భారం


ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి

కేంద్రంలోని బిజెపి-మోడీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలతో అనేక రైళ్లు సామాన్య రైల్వే ప్రయాణీకులకు అందుబాటులో లేకుండా పోయాయి. బిజెపి ప్రభుత్వం అనేక రూట్లలో గతంలో ఉన్న రైళ్ల సంఖ్యను కుదించివేసింది. దీనిలో భాగంగానే మచిలీపట్నం నుంచి వెళ్లే పలు రైళ్లను రద్దు చేయడంతో ప్రయాణీకులకు సమస్యలు తప్పడం లేదు. అధిక వ్యయ ప్రయాసలకోర్చి బస్సుల్లో ప్రయాణించాల్సి వస్తోంది.

చారిత్రక ప్రాధాన్యత ఉన్న ఒకప్పటి ఓడరేవు పట్టణమైన మచిలీపట్నానికి బ్రిటీష్ పాలకుల హయాంలోనే దేశంలోని అనేక ప్రాంతాల నుంచి రైళ్లను అనుసంధానం చేశారు. బస్సులు, ఇతర వాహన ప్రయాణాలతో పోలిస్తే చౌకగా ఉండటంతో బందరుతోపాటు సమీప అవనిగడ్డ, చల్లపల్లి, కోడూరు తదితర మండలాల్లోని సామాన్య, మధ్య తరగతి ప్రజలు రైలు ప్రయాణానికి ఎక్కువగా మొగ్గు చూపారు. ఈనేపథ్యంలోనే యుపిఎ-2 ప్రభుత్వ హయాంలో మచిలీపట్నం - గుడివాడ - విజయవాడ రూటు ఆధునీకరణ పనులకు ప్రణాళికలు రూపొందాయి. 2021 ఆధునీకరణ పనులు పూర్తయ్యాయి. రూట్లను డబ్లింగ్ ఎలక్ట్రిఫికేషన్ చేశారు. మచిలీపట్నం, గుడివాడ స్టేషన్లను ఆధునీకరించారు. మచిలీపట్నంలో ఆఫీసర్లు, ఉద్యోగుల నివాసానికి క్వార్టర్లు నిర్మించారు. వేల కోట్ల రూపాయలతో ఆధునీకరించారు. అయితే బిజెపి ప్రభుత్వం మచిలీపట్నం వచ్చే రైళ్ల సంఖ్యను మాత్రం కుదించి వేసింది. ఈ రూట్లో అత్యధిక డిమాండ్ ఉండే మచిలీపట్నం - విశాఖపట్నం రైలును పూర్తిగా నిలిపివేసింది. రోజు వారీ మచిలీపట్నం- తిరుపతి వెళ్లే రైలును వారానికి ఒక రోజుకే పరిమితం చేసింది.

సామాన్య, మధ్య తరగతిపై భారం

బస్సుతో పోల్చుకుంటే రైలు ప్రయాణం కొంత తక్కువగా ఉంటుంది. సామాన్య, మధ్యతరగతి ప్రజలు తమ (మిగతా 2లో)



8న విజయవాడలో ప్రధాని మోడీ రోడ్ షో

ప్రజాశక్తి - విజయవాడ : ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రధాని నరేంద్ర మోడీ ఈనెల 8వ తేదీన విజయవాడలో రోడ్ షో నిర్వహించనున్నారు. ఆ రోజు సాయంత్రం 6.25 గంటలకు ఆయన విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుండి రోడ్డు మార్గాన విజయవాడ చేరుకుంటారు. రాత్రి 7 నుండి 8 గంటల వరకు విజయవాడలో జరిగే రోడ్ షోలో పాల్గొంటారు. అనంతరం ఆయన తిరిగి విమానాశ్రయం చేరుకొని ఢిల్లీకి బయల్దేరి వెళతారు. ప్రధాని పర్యటన నేపథ్యంలో శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.ఎస్.జవహర్ రెడ్డి సంబంధిత జిల్లాల కలెక్టర్లు, పోలీస్, సంబంధిత శాఖ అధికారులతో వర్చువల్ విధానంలో సమావేశమై దిశా నిర్దేశం చేశారు. నగరంలోని కలెక్టరేట్ నుండి కలెక్టర్ ఢిల్లీ రావు ఈ సమావేశంలో మాట్లాడుతూ ఈసిఐ మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రధాని పర్యటనకు అన్ని ఏర్పాట్లు చేస్తామని సిఎస్‌కు వివరించారు. ఎటువంటి లోటుపాట్లకు తావులేకుండా అప్రమత్తంగా అండాలని సిఎస్ సూచించారు.



విజయవాడ సింగ్‌నగర్‌లో బ్యాంకు లోపలకు వెళ్లేందుకు వేచి ఉన్న పింఛనుదారులు

బ్యాంకుల వద్ద తప్పని నిరీక్షణ



ఏటిఎం వద్ద వేచి ఉన్న పింఛనుదారులు

బ్యాంకుల్లో జమ అయిన తమ పింఛను సొమ్ము తీసుకునేందుకు శుక్రవారం కూడా కృష్ణా, ఎన్‌టిఆర్ జిల్లాల్లో పింఛనుదారులకు నిరీక్షణ తప్పలేదు. పింఛను నగదు తీసుకునేందుకు వృద్ధులు, వికలాంగులు పాట్లు పడుతూనే ఉన్నారు. మండుటెండలో గ్రామాల నుంచి సుదూరాన ఉన్న బ్యాంకులకు చేరుకునేందుకు ఆపసోపాలు పడుతున్నారు. అష్టకష్టాలు పడి బ్యాంకు వద్దకు చేరుకున్నా అక్కడి క్యూలైన్‌ను చూసి బెంబేలెత్తిపోతున్నారు. అక్కడి జనాలను చూస్తుంటే మళ్లీ రేపు రావాలేమో అన్నట్లు ఉంది పరిస్థితి.

వార్త 7లో



ప్రజా గొంతుక ఎర్రజెండా

- విజయవాడ 'సెంట్రల్'లో ఎన్నో ఉద్యమాలు
- సమస్యల పరిష్కారానికి సిపిఎం పోరాటాలు
- నీటి మీటర్లకు వ్యతిరేకంగా ఆందోళనలు
- రేషన్ కార్డులు, ఇళ్ల రిజిస్ట్రేషన్లు కోసం బాధితులకు అండగా నేతలు

కథనం మధ్య పేజీలో

నేటి నుంచి పోస్టల్ బ్యాలెట్

- ఎన్‌టిఆర్ జిల్లాలో 7 నుండి హోం ఓటింగ్
- పోస్టల్ బ్యాలెట్, హోం ఓటర్లు 23 వేల మంది

ప్రజాశక్తి - విజయవాడ, అర్బన్, కలెక్టరేట్ (కృష్ణా)

ఈ నెల 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా శుక్రవారం నుండి పోస్టల్ బ్యాలెట్ ప్రారంభం కానుంది. పోలింగ్ విధులతోపాటు ఎన్నికలకు సంబంధించిన ఇతర విధులు నిర్వర్తించే అధికారులు, సిబ్బందితోపాటు :హోం ఓటింగ్‌తో కలిపి ఎన్‌టిఆర్ జిల్లాలో మొత్తం 23 వేల మందికిపైగా ఓటర్లు బ్యాలెట్ పేపర్ల ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. అందుకు అవసరమైన అన్ని ఏర్పాట్ల అధికార యంత్రాంగం పూర్తిచేసింది. పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకునేందుకు నగరంలోని ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో ఫెసిలిటేషన్ సెంటర్ ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాన్ని శుక్రవారం కలెక్టర్ ఎస్. డిల్లిరావు పరిశీలించారు. ఎన్నికల్లో ప్రత్యక్షంగా పోలింగ్ బూత్‌కు వచ్చి ఓటు హక్కును వినియోగించుకోలేక హోం ఓటింగ్‌కు దరఖాస్తు చేసుకున్న అర్హత ఉన్న 1,052 మంది ఓటర్లకు వారి ఇంటి వద్దనే ఈనెల 7, 8, 9 తేదీల్లో ఉదయం 9 నుంచి 5 గంటలలోపు ఓటు హక్కును వినియోగించుకునేందుకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. జిల్లాలో ఓటు హక్కు ఉండి సాధారణ ఎన్నికల్లో విధులు నిర్వర్తించే అధికారులు, సిబ్బంది ఈ నెల 2వ తేదీ ఉదయం వరకు పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. 706 మంది అత్యవసర సేవల సిబ్బంది, 6,191 మంది పీవోలు, ఏపీవోలు, ఓపీవోలకు, 5,115 మంది సెక్టార్, బూత్ లెవెల్ అధికారులు, డ్రైవర్లు, 231 మంది మైక్రో అబ్జర్వర్లు, 1304 మంది పోలీస్ సిబ్బంది, 452 మంది (మిగతా 2లో)



పోస్టల్ బ్యాలెట్ పత్రాలను చూపుతున్న ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డిల్లీరావు



కొవ్వొత్తులతో జర్నలిస్టుల ప్రదర్శన

ప్రజాశక్తి - విజయవాడ

ప్రపంచ పత్రికా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం విజయవాడలో జర్నలిస్టులు కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. 'జర్నలిజాన్ని కాపాడండి - జర్నలిస్టులను రక్షించండి' (సేవ్ జర్నలిజం - ప్రొటెక్ట్ జర్నలిస్ట్) నినాదంతో విజయవాడలోని జర్నలిస్ట్సు ఫెడరేషన్ రాష్ట్ర కార్యాలయం వద్ద ఈ కార్యక్రమం జరిగింది. నేషనల్ అలయెన్స్ ఆఫ్ జర్నలిస్ట్సు (ఎన్ఎజె), ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్సు ఫెడరేషన్ (ఎపిడబ్ల్యుజెఎఫ్), ఆంధ్రప్రదేశ్ బ్రాడ్‌కాస్ట్ జర్నలిస్ట్సు అసోసియేషన్ (ఎపిబిజెఎ) ఆధ్వర్యాన జర్నలిస్టులు కొవ్వొత్తులు చేతబట్టుకుని ప్రదర్శన చేశారు. దేశంలో సాధారణ ఎన్నికలు జరుగుతున్న తరుణంలో భావప్రకటనా స్వేచ్ఛకు, జర్నలిజం ప్రతిష్టకు, హక్కుల పరిరక్షణకు తీవ్ర ముప్పు ఏర్పడుతోందని ఈ సందర్భంగా నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థులు, రైతులతోపాటు లౌకికివాదం, ప్రజాస్వామ్యం గురించి ప్రస్తావించేవారిపై దాడులు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎస్.వెంకట్రావు, జి.ఆంజనేయులు, రాష్ట్ర నాయకులు షేక్ ఖాజావలి, గోరంట్లప్ప, నగర అధ్యక్ష కార్యదర్శులు కె.కలిమిశ్రీ, ఎం.బి.నాథన్, నగర నాయకులు జె.వి.శ్రీనివాస్, వి.హరినారాయణ రాజు. ఎ.రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

విజయవంతంగా ఈవీఎం ర్యాండమైజేషన్

అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు హాజరు

ప్రజాశక్తి - విజయవాడ

విజయవాడ పార్లమెంటరీ నియోజకవర్గానికి సంబంధించి తొలి సప్లిమెంటరీ ర్యాండమైజేషన్ (బ్యాలెట్ యూనిట్లు), రెండో ర్యాండమైజేషన్ (బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీప్యాట్లు) ప్రక్రియ విజయవంతంగా ముగిసింది. జిల్లా కలెక్టరేట్ ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ రూంలో శుక్రవారం ఉదయం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.డిల్లీరావు ఆధ్వర్యంలో అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈ ప్రక్రియ నిర్వహించారు. మధ్యాహ్నం జనరల్ అబ్జర్వర్లు మంజూ రాజ్‌పాల్, నరీందర్‌సింగ్ బాలిలతోపాటు అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో బీయూ, సీయూ, వీవీప్యాట్‌ల రెండో ర్యాండమైజేషన్ జరిగింది. ఈసందర్భంగా కలెక్టర్ డిల్లీరావు మాట్లాడుతూ విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గానికి 17 మంది అభ్యర్థులు పోటీలో ఉండటంతో రెండో బ్యాలెట్ యూనిట్ అవసరమైనట్లు తెలిపారు. ఒక బ్యాలెట్ యూనిట్‌లో 15 మంది అభ్యర్థులు, ఒక నోటా బటన్‌కు మాత్రమే వీలుంటుందని తెలిపారు. 2,147 అదనపు బీయూల కేటాయింపునకు ఈ సప్లిమెంటరీ ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించినట్లు వివరించారు. అలాగే ఈవీఎంలను పోలింగ్ స్టేషన్లకు అనుసంధానించేందుకు రెండో ర్యాండమైజేషన్ కూడా చేపట్టినట్లు తెలిపారు. 4,294 బీయూలు, 2,147 సీయూలు, 2,324 వీవీప్యాట్లకు సంబంధించి ఈ ప్రక్రియ చేపట్టినట్లు కలెక్టర్ వివరించారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి ఎస్.డిల్లీరావు

ప్రజాస్వామ్య స్ఫూర్తితో ఎన్నికల నిర్వహణలో భాగస్వాములు కావాలి

జనరల్ అబ్జర్వర్లు మంజూ రాజ్‌పాల్, నరీందర్ సింగ్ బాలి

ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తయిన అనంతరం జనరల్ అబ్జర్వర్లు మంజూ రాజ్‌పాల్, నరీందర్‌సింగ్ బాలిలు విజయవాడ పార్లమెంటరీ నియోజకవర్గానికి సంబంధించి పోటీలో నిలిచిన అభ్యర్థులు, అభ్యర్థుల ప్రతినిధులతో మాట్లాడారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రజాస్వామ్య స్ఫూర్తితో శాంతియుతంగా, స్వేచ్ఛాయుతంగా ఎన్నికల నిర్వహణలో భాగస్వాములు కావాలని పేర్కొన్నారు. వివిధ అంశాలపై స్పష్టమైన అవగాహన పెంపొందించుకోవాలన్నారు. ఉల్లంఘనలకు సంబంధించి తమకు ఫిర్యాదు చేయొచ్చన్నారు. వేసవి నేపథ్యంలో పోలింగ్ స్టేషన్ల వద్ద చేయాల్సిన ఏర్పాట్లపైనా చర్చించారు. అదేవిధంగా పోస్టల్ బ్యాలెట్ విధివిధానాలు, అర్హులైన వారు వినియోగించుకునే విధానంపైనా కలెక్టర్ డిల్లీరావు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీఆర్వో వి. శ్రీనివాసరావు, ఎన్నికల సెల్ సూపరింటెండెంట్ ఎం.దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

మొదటిపేజీ తరువాయి

బిజెపి పాలనలో రైళ్లు రద్దు

ప్రయాణాలకు ఎక్కువగా రైళ్లను ఆశ్రయిస్తారు. బందరు-విశాఖ రైలు ఛార్జి రూ.145, తిరుపతికి రూ.170 వరకు ఉండేది. ఈ నేపథ్యంలోనే బందరు నుంచి విశాఖ, తిరుపతి వెళ్లాల్సిన చల్లపల్లి, ఘంటసాల, అవనిగడ్డ, నాగాయలంక, కృత్తివెన్ను, బంటుమిల్లి తదితర మండలాలకు చెందిన పేద, మధ్య తరగతి ప్రయాణీకులు మచిలీపట్నం, పెడనల్లో ఆయా రైళ్లను ఆశ్రయించే వారు. విశాఖ రైలును ఏడు నెలల క్రితం పూర్తిగా నిలిపివేశారు. రోజువారీ వెళ్లే తిరుపతి రైలును వారంలో ఒక్కరోజుకు పరిమితం చేశారు. దీంతో ప్రయాణీకులు బస్సులను ఆశ్రయించకతప్పడం లేదు. బందరు నుంచి విశాఖ, తిరుపతి వెళ్లడానికి బస్సు టికెట్‌కు రూ.700కుపైగా చెల్లించాల్సి వస్తోంది. దీంతో సామాన్య, మధ్య తరగతి ప్రయాణీకులపై మూడు రెట్లకుపైగా అదనపు భారం పడుతోంది.

నేటి నుంచి పోస్టల్ బ్యాలెట్

ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్, ఎక్స్‌సర్వీస్‌మెన్, ఇతర యూనిఫాం సర్వీసెస్‌లకు చెందిన వారు దరఖాస్తు చేసుకున్నారు. ఇతర జిల్లాల్లో ఓటు హక్కు ఉన్న మరో 2,641 మంది ఎన్నికల అధికారులు, సిబ్బంది, జిల్లాకు చెందిన 150 మంది, ఇతర జిల్లాలకు చెందిన 625 మంది పోస్టల్ బ్యాలెట్లకు దరఖాస్తు చేసుకున్నారు. వీరంతా ఈ నెల 4, 5, 6 తేదీల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారుల పర్యవేక్షణలో ఏర్పాటుచేసిన ఫెసిలిటేషన్ సెంటర్లలో పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకోవాల్సి ఉంటుంది. ఈనెల 7, 8, 9 తేదీల్లో ప్రత్యేక బందాలు హోం ఓటింగ్ కోసం దరఖాస్తు చేసుకున్న వారి గహాలకు వెళ్లి ఓటు హక్కును వినియోగించుకునేందుకు అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంది. ఈనెల 4, 6 తేదీల్లో ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు వారికి కేటాయించిన నియోజకవర్గంలో ఎన్నికల విధులపై అధికార యంత్రాంగం శిక్షణ ఇవ్వనుంది.

కృష్ణాజిల్లాలో ఈనెల 4న పిఓలు, ఏపీవోలు, మైక్రో అబ్జర్వర్లు, 5న ఓపిఓలు, 6న పోలీస్ సిబ్బంది, ఎసెన్షియల్ సర్వీసెస్, డ్రైవర్లు, వీడియో గ్రాఫర్లు తదితరులకు ఆయా అసెంబ్లీ నియోజకవర్గాల హెడ్ క్వార్టర్లలో ఫెసిలిటేషన్ సెంటర్లు ఏర్పాటు చేశారు. చేస్తున్నట్లు ఈనెల 7, 8 తేదీల్లో నిరంతరం ఫెసిలిటీ కేంద్రాలను రిటర్నింగ్ అధికారుల వద్ద ఏర్పాటు చేయనున్నారు. పోస్టల్ ఓటింగ్ కోసం గన్నవరంలో జడ్పీ హైస్కూల్ బాయ్స్, గుడివాడలో వికేఆర్ విఎన్‌బి ఇంజనీరింగ్ కళాశాల, పెడనలో వాసవి ఇంజనీరింగ్ కళాశాల (నందమూరు), మచిలీపట్నంలో నోబుల్ కళాశాల, అవనిగడ్డలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పామర్రు ఎస్‌కెఆర్‌ఆర్ జడ్పీ హైస్కూల్, పెనమలూరులో జడ్పీ హైస్కూల్‌లో ఫెసిలిటేషన్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నారు. రాష్ట్రంలోని ఇతర జిల్లాలకు సంబంధించి మచిలీపట్నం చిలకలపూడిలోని పాండురంగ మునిసిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలలో ఫెసిలిటిషన్ కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ మేరకు కృష్ణాజిల్లా కలెక్టర్ డికె.బాలాజీ ఒక ప్రకటన విడుదల చేశారు.



ఆర్థిక సహాయం అందజేస్తున్న సభ్యులు

'దీవెన' ఆర్థిక సాయం

ప్రజాశక్తి - వన్‌టౌన్ : సూర్యా రావుపేట పోలీస్‌స్టేషన్‌లో హోమ్ గార్డ్‌గా పనిచేస్తున్న దాసు సడన్‌గా హార్ట్ స్ట్రోక్ రావడంతో ఆంధ్ర హాస్పటల్‌లో శుక్రవారం హార్ట్ సర్జరీ చేశారు. ఆర్థిక పరిస్థితి సహకరించక సహాయం కొరకు దీవెన ఫౌండేషన్ వారిని ఆశ్రయించగా శుక్రవారం దీవెన ఫౌండేషన్ విజయవాడ పోలీస్ వారి తరపున రూ. 10 వేలు ఆర్థిక సహాయం హాస్పటల్ ఖర్చుల నిమిత్తం గ్రూప్ సభ్యులు హెడ్ కానిస్టేబుల్ జాజుల నాగరాజు హాస్పిటల్‌కి వెళ్లి వారికి ఆర్థిక సహాయం వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. పేదవారికి ఆపదలో ఉన్న వారికి సహాయం చేస్తున్న ఫౌండేషన్ సభ్యులకు దాసు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియచేశారు.

ఓటర్ ఫెసిలిటేషన్ కేంద్రం ద్వారా పారదర్శక సేవలు

కలెక్టర్ డిల్లీరావు ఆదేశం

ప్రజాశక్తి - విజయవాడ : నగరంలోని ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియంలోని కేంద్రీకత ఓటర్ ఫెసిలిటేషన్ కేంద్రంలో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఏర్పాట్లు చేసినట్లు జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు తెలిపారు. కేంద్రీకత ఓటర్ ఫెసిలిటేషన్ కేంద్రంలో విధులు నిర్వర్తించే అధికారులు, సిబ్బందికి కలెక్టర్ డిల్లీరావు శుక్రవారం కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో దిశానిర్దేశం చేశారు. తొలి పోలింగ్ ఆఫీసర్, రెండో పోలింగ్ ఆఫీసర్, మూడో పోలింగ్ ఆఫీసర్, 4వ పోలింగ్ ఆఫీసర్‌లకు నిర్దేశించిన స్పష్టమైన విధులపై అవగాహన కల్పించారు. వివరాల పరిశీలన, అనుబంధం-5లో సంతకం తీసుకోవడం, చేతి వేలుపై ఇంక్ అప్లై చేయడం, పోస్టల్ బ్యాలెట్ ఇషఠ్యు చేయడం తదితర అంశాలను వివరించారు. అదే విధంగా ఫారం-13ఏ, ఫారం-13బీ, ఫారం-13సీ, ఫారం-13డీ విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వరుస క్రమంలో వివరించారు. ప్రతి విషయంలోనూ అప్రమత్తత అవసరమని.. ఎక్కడా ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా విధులు నిర్వర్తించాలని కలెక్టర్ డిల్లీరావు సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎస్ఈవో యూవీ సుబ్బారావు, ఐసీడీఎస్ పీడీ జి.ఉమాదేవి, గ్రామ వార్డు సచివాలయాల సమన్వయ అధికారి కె.అనూరాధ తదితరులు పాల్గొన్నారు.



కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న ఎంఎల్ఎ రమేష్‌బాబు

వైసిపిలో చేరిక

ప్రజాశక్తి-అవనిగడ్డ : మండల పరిధి .లోని పాత ఎడ్ల లంక గ్రామానికి చెందిన జనసేన గ్రామ పార్టీ కన్వీనర్ నల్లగల నరసింహారావు, ఐదవ వార్డు సభ్యులు వనమాలి విజయబాబు లతోపాటు టిడిపి జనసేన పార్టీలకు చెందిన 70 కుటుంబాల వారు వైఎస్ఆర్ కండువాలు కప్పుకున్నారు. వైసీపీ అవనిగడ్డ నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి సింహాద్రి రమేష్ బాబు, నియోజకవర్గ యువ నాయకులు సింహాద్రి వికాస్ లా చేతులమీదుగా కండువాలు కప్పి వారిని ఆహ్వానించారు. ఈ సందర్భంగా మచిలీపట్నం పార్లమెంట్ అభ్యర్థిగా డాక్టర్ సింహాద్రి చంద్రశేఖర రావు ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. జడ్పిటిసి చింతలపూడి లక్ష్మీనారాయణ, ఎడ్ల లంక ఎంపీటీసీ మెరుగుపాల జెరుసాలెం, అవనిగడ్డ మాజీ సర్పంచ్ నలుపుర్తి పథ్వి రాజు, ఎడ్ల లంక మాజీ సర్పంచ్ సైతం బాబురావు, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి నలుపుర్తి రమేష్, మండల బీసీ సెల్ కన్వీనర్ సైకం నాగరాజు పాల్గొన్నారు



ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి-చల్లపల్లి : చల్లపల్లి మండలం పాగోలులో కూటమి అభ్యర్థులు వల్లభనేని బాలసౌరి, మండలి బుద్ధప్రసాద్ విజయం కోరుతూ టీడీపీ, జనసేన నేతలు శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎంపీ బాలసౌరి సోదరుడు వల్లభనేని బాలకోటేశ్వరరావు ఆయా పార్టీల నేతలతో కలిసి ఇంటింటి ప్రచారం చేసి గాజు గ్లాసు గుర్తుకే రెండు ఓట్లు వేసి పార్లమెంట్ అభ్యర్థి బాలసౌరి నియోజకవర్గ అభ్యర్థి మండలి బుద్ధ ప్రసాద్ లకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

'నయవంచన' పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి - గుడివాడ : నయవంచన 10 సంవత్సరాల నిరంకుశ పాలన, 10 దారుణ మోసాలు తదితర అంశాలు పొందపరచి ఉన్న పుస్తకాన్ని ప్రతి ఒక్కరూ చదివి బిజెపి నిరంకుశత్వాన్ని తెలుసుకోవాలని సిపిఎం పట్టణ కార్యదర్శి ఆర్‌సిపి రెడ్డి అన్నారు. గుడివాడ సుందరయ్య భవనంలో శుక్రవారం నయవంచన పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆర్‌సిపి రెడ్డి మాట్లాడుతూ పది సంవత్సరాల బిజెపి పాలనలో నయవంచన పది దారుణ మోసాలు అనే పుస్తకం ప్రచురించారని, ప్రజలు మళ్ళీ మోసపోకూడదనే ఉద్దేశ్యంతోనే ఆంధ్రప్రదేశ్ పౌర హక్కుల సంఘం ఈ పుస్తకాన్ని అందించడానికి ప్రయత్నం చేస్తున్నారన్నారు. దీనిలో 10 దారుణ మోసాలలో ప్రప్రథమంగా ధరల పెరుగుదల నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత ధరలు



పుస్తకం విడుదల చేస్తున్న ఆర్‌సిపి రెడ్డి, తదితరులు

తగ్గిస్తానని చెప్పి ధరలను విపరీతంగా పెంచడం జరిగిందన్నారు. ప్రతి ఒక్కరూ ఈ పుస్తకాన్ని చదివి కేంద్రం చేస్తున్న మోసాన్ని తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా కార్యదర్శి పి రజిని, పార్టీ నాయకులు పి వీరమ్మ, పి ప్రభుదాసు పాల్గొన్నారు.

టిడిపి కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి - గుడివాడ : గుడివాడ 16వ వార్డులో టిడిపి కార్యాలయాన్ని టిడిపి నాయకుడు అంగడాల వెంకటేశ్వ రరావు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి విజయాన్ని ఎవరూ ఆపలేర న్నారు. ముఖ్యంగా బిసిలు, టిడిపికి కంచుకోటగా నిలబడి గుడివాడ అభ్యర్థి వెనిగండ్ల రాము, జనసేన పార్లమెంట్ అభ్యర్థి వల్లభనేని బాలశౌరిలకు సైకిల్, గాజు గ్లాసు గుర్తులపై ప్రతి ఒక్కరు ఓటు వేసి గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణా మహిళాధ్యక్షురాలు యార్లగడ్డ సుధారాణి, నాయకులు ముళ్ళపూడి రమేష్, వార్డు పెద్దలు పాల్గొన్నారు.



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న అంగడాల వెంకటేశ్వరరావు

టిడిపి గెలుపును ఆపలేరు : యలవర్తి

టిడిపి విజయం ప్రజలు ఎపుడో నిర్ణయించడం జరిగిందని, దానిని ఏ శక్తి ఆపలేదని మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు అన్నారు. గురువారం స్థానిక 4, 13 వార్డుల్లో కూటమి అభ్యర్థులు వెనిగండ్ల రాము, వల్లభనేని బాలశౌరిల గుర్తులైన సైకిల్, గ్లాస్ గుర్తుకి ఓటు వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరుతూ యలవర్తి ప్రచారం నిర్వహించారు. కూటమి నాయకులు కనకంబరం, మేరుగు మోజెస్, బలసాని భవానిశంకర్, సిరిపురపు తులసిరాణి, కొడాలి వేణు, కొడాలి బాలు, కొడాలి అనిల్, వాసు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం

ప్రజాశక్తి-గన్నవరం : టీడీపీ-జనసేన-బి.జె.పి గన్నవరం నియోజకవర్గ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు, మాజీ ఎంఎల్ఎ ముద్దరబోయిన వెంకటేశ్వరరావు శుక్రవారం వీరపనేని గూడెం, తెంపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రజల సమస్యలను వింటూ ముందుకు సాగారు. రాబోయే ఎన్డీయే కూటమి సంకీర్ణ ప్రభుత్వంలో ప్రజలకు అందించనున్న పథకాలను, గన్నవరం నియోజకవర్గ అభివద్ధికి ప్రత్యేకంగా రూపొందించిన సూపర్ సిక్స్ ప్రణాళికను తెలియజేస్తూ ముద్రించిన కరపత్రాలను ప్రజలకు అందజేశారు. ఈ సందర్భంగా ముద్దరబోయిన మాట్లాడుతూ రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రప్రదేశ్ గా చేయగల సమర్ధుడు నారా చంద్రబాబునాయుడని ఆయన్ను తిరిగి రాష్ట్ర ముఖ్య



మాట్లాడుతున్న యార్లగడ్డ వెంకట్రావు

మంత్రి చేయాల్సిన భాధ్యత ప్రజలపై ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు జాస్తి వెంకటేశ్వరరావు, నాయకుడు మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు..

బిజెపికి కొమ్ముకాస్తున్న పార్టీలను ఓడించాలి : కాంగ్రెస్

ప్రజాశక్తి-గన్నవరం : దేశంలో ఎక్కడా లేనివిధంగా మన రాష్ట్రంలో ఒక విచిత్ర పరిస్థితి నెలకొందని, రాష్ట్రంలో బాహాబాహీగా తలపడుతున్న ప్రధాన పార్టీలు రెండూ ఆచరణలో బిజెపికి కొమ్ముకాస్తున్నాయని మళ్లీ మళ్లీ జనం మోసపోకూడదని కృష్ణా జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వింతా సంజీవరెడ్డి అన్నారు. ఇండియా వేదిక, సిపిఐ



కాంగ్రెస్ బలపరిచిన సిపిఎం గన్నవరం నియోజకవర్గం సిపిఎం అభ్యర్థి కళ్లం వెంకటేశ్వరరావు, మచిలీపట్నం కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గొల్లు కష్ణలకు ఈ ఎన్నికల్లో ప్రజలు మద్దతు పలకాలని పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ...ప్రజల మీద ఎడాపెడా దాడిచేస్తున్న బిజెపికి కుడి ఎడమలుగా టిడిపి వైసిపి నిలబడ్డాయన్నారు. నిజానికి ఈ ఎన్నికల యుద్ధం వైఎస్ఆర్‌సిపికి, టిడిపి - జనసేనకే మధ్య కాదనీ ఆ పార్టీలకూ, ప్రజలకూ మధ్య జరిగే యుద్ధం అన్నారు. పదేళ్లుగా ఈ రాష్ట్రాన్ని పాలించిన టిడిపి, వైసిపి విభజన చట్టం లోని హామీలను అమలు చేయించుకోడానికి కేంద్రంలోని మోడీ ప్రభుత్వాన్ని ఏనాడూ నిలదీయలేదని చెప్పారు. మోడీ ప్రభుత్వం రాష్ట్రానికి చేసిన, చేస్తున్న తీవ్ర అన్యాయాన్ని ఏనాడూ నామమాత్రంగానూ ప్రశ్నించలేదన్నారు. ఈ పరిస్థితుల్లో బి.జె.పి.నీ దానికి తోడుగా ఉన్న శక్తులనూ ఓడించి, ప్రజల తరపున నికరంగా నిలబడే ఇండియా వేదిక పార్టీలను గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రజల మీద ఉందన్నారు.

ఓటమి భయంతోనే దాడులు : టిడిపి

ప్రజాశక్తి కలక్టరేట్ (కష్ణా) : మచిలీపట్నం వైసీపీ ఎంఎల్ఎ అభ్యర్థి పేర్ని కిట్టు రౌడీయిజాన్ని, గుండాయిజాన్ని నమ్ము కుని ఎన్నికల ప్రచారంలో తిరు గుతు న్నాడని మచిలీ పట్నం



మాట్లాడుతున్న లుక్కా సాయిరాం ప్రసాద్

నియోజకవర్గం పరిశీలకులు, రాష్ట్ర పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి లుక్కా సాయిరాం ప్రసాద్ గౌడ్ ఆరోపించారు. శుక్రవారం స్థానిక పార్లమెంట్ కార్యాలయంలో నిర్వహించిన విలేఖర్ల సమావేశంలో లుక్కా సాయిరాం ప్రసాద్ గౌడ్ మాట్లాడుతూ జగన్ రెడ్డి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ, నియోజకవర్గంలో ప్రచారంలో దూసుకుపోతున్న కొల్లు రవీంద్రకి వచ్చే ఆదరణను చూసి తట్టుకోలేక పేర్ని నాని పన్నిన పన్నాగమే పేర్ని కిట్టు అరాచకం అన్నారు. మంత్రిగా పనిచేసిన పేర్ని నాని నియోజకవర్గానికి చేసిన అభివద్ధి శూన్యం అన్నారు. వైసిపి చేస్తున్నా అరాచకాలకు రాబోయే రోజుల్లో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని, పేర్ని కిట్టుకి కనీసం డిపాజిట్టు కూడా రావని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యాలయ కార్యదర్శి బత్తిన దాసు పాల్గొన్నారు.

వైసిపితోనే సంక్షేమం సాధ్యం : కైలే

ప్రజాశక్తి-పమిడిముక్కల : వైయస్ జగన్మో హన్‌రెడ్డి ప్రభుత్వం నవరత్నాల పేరుతో సంక్షేమ ఫలాలు అందజేస్తోందని పామర్రు ఎమ్మెల్యే కైలా అనిల్ కుమార్ అన్నారు. శు క్రవారం పమిడి ముక్కల మండలంలోని వెల్వారు, ముళ్ళపూడి గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సందర్భంగా ఆయన మాట్లా డుతూ అమ్మ ఒడి, రైతు భరోసా, జగనన్న కాలనీలు, ప్రజా సంక్షేమ కార్యక్రమాలను వైయస్ జగన్మోహన్ రెడ్డి అమలు చేసిందని అన్నారు. మళ్లీ వైసిపికి అవకాశం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎం ఆర్ పార్టీ మండల అధ్యక్షుడు ఎలమంచిలి గణేష్, సుభాష్ చంద్రబోస్, పక్కా అంజిబాబు, ఏనుగ వెంకటేశ్వర్లు, తిరుమ లశెట్టి వాసు, కొనమంచిలి మహేష్ తదితరులు పాల్గొ న్నారు.



ప్రచారంలో కైలే అనిల్‌కుమార్‌కు తిలకం దిద్దుతున్న దృశ్యం

మద్యం షాపులు మూసివేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : జిల్లాలో పోలింగ్, కౌంటింగ్ తేదీలకు ముందు 48 గంటలు అన్ని మద్యం షాపులు మూసి ఉంచాలని, డ్రై డే గా పాటించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలక్టర్ డికె.బాలాజీ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసారు. జిల్లాలో ఎన్నికలు శాంతియుతంగా సజావుగా నిర్వహించుటకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డికే బాలాజీ ఒక ప్రకటనలో తెలిపారు. భారత ఎన్నికల సంఘం నిర్దేశించిన విధంగా జిల్లాలో పోలింగ్ రోజు అనగా మే 13వ తేదీకి 48 గంటలు ముందు అనగా మే 11వ తేది సాయంత్రం 6 గంటల నుండి మే 13వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు జిల్లాలోని అన్ని మద్యం షాపులు, బార్లు, క్లబ్బులు,కల్లు అంగళ్ళు, హెటల్లు, రెస్టారెంట్ క్లబ్బులు, ఇతర మద్యం షాపులు మూసి ఉంచాలన్నారు. అదేవిధంగా ఓట్ల లెక్కింపు రోజు అనగా జూన్ 4వ తేదీకి 48 గంటలు ముందు ఓట్ల లెక్కింపు జరిగే ప్రదేశాల వద్ద వద్ద డ్రై డే గా పాటించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు, స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు ఈ ఉత్తర్వుల అమలుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

తాటి ముంజలకు గిరాకీ

ప్రజాశక్తి-గన్నవరం : ప్రచండ భానుడి ప్రతాపంతో జనం అల్లాడిపోతున్నారు... తీవ్రమైన ఎండల నుంచి ఉపశమనం పొందేందుకు సహజ సిద్ధమైన తాటి ముంజలు తింటు ఉపశమనం పొందుతున్నారు.. గన్నవరం ప్రాంతంలో తెల్లవారు జామున 4 గంట లకు పంట పొలాలు వెళ్లి తాడి చెట్టు నుంచి ముంజలు తీసి 40 కిలోమీటర్ల దూరం వెళుతున్నారు. అదేవిధంగా బాపుల పాడు మండలంలోని వీరవల్లి, నారాయణపురం, శోభనాద్రి పురం, తేలప్రోలు గ్రామాల నుంచి వీటిని తీసుకువచ్చి నగరంలోని వివిధ కూడళ్ల వద్ద అమ్ముతున్నారు.



ప్రజాశక్తి
www.prajasakti.com
కృష్ణాజిల్లా
శనివారం
4 మే 2024

బుల్లెట్‌పై ఎన్నికల ప్రచారం



ప్రజాశక్తి-పెదపారుపూడి : టిడిపి, బిజెపి, జనసేన పార్టీల పామర్రు నియోజకవర్గ అభ్యర్థి వర్ల కుమార్ రాజా ఎన్నికల ప్రచారంలో భాగంగా వినూత్నమైన రీతులో, భగభగ మండుతున్న ఎండ వేడిలో బుల్లెట్ నడుపుతూ ఓటర్లను అభ్యర్థిస్తూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా మండలంలోని జువ్వనపూడి,ఈదుల మద్దాల, పెదపారుపూడి, గురువిందగుంట, మహేశ్వర పురం, దూలవానిగూడెం, భూషణగూళ్ల గ్రామాలలో విస్తత ప్రచారం శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి, ప్రధాన కార్యదర్శి మసిముక్కు రాంబాబు, ఆ పార్టీ సీనియర్ నాయకుడు సురపనేని వెంకట సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



ఇండియా వేదిక నాయకుల ప్రచారం



ప్రజాశక్తి మచిలీపట్నం రూరల్ : మచిలీపట్నంలోని స్థానిక ఆనందపేటలో ఇండియా కూటమి కాంగ్రెస్, సీపీఐ , సీపీఎం నాయకులు విస్తత ప్రచారం నిర్వహించారు. రాష్ట్రానికి ఇప్పుడున్న సంక్షోభంలో ప్రత్యేక హెూదా అవసరం ఉందని, కేవలం కాంగ్రెస్ పార్టీ మాత్రమే ప్రత్యేక హెూదా ఇవ్వగలదు అని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఏమ్మెల్వే అభ్యర్థి అబ్దుల్ మతీన్,సిపిఎం నాయకులు బూర సుబ్రహ్మణ్యం, సీహెచ్ రాజేష్,రామారావు,స్థానిక ప్రజలు, కాంగ్రెస్, సీపీఐ నాయకులు మరియు ఇండియా కూటమి శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.

ప్రజాగొంతుక ఎర్రజెండా

- విజయవాడ 'సెంట్రల్'లో ఎన్నో ఉద్యమాలు
- సమస్యల పరిష్కారానికి సిపిఎం పోరాటాలు
- నీటి మీటర్లకు వ్యతిరేకంగా ఆందోళనలు
- రేషన్ కార్డులు, ఇళ్ల రిజిస్ట్రేషన్ల కోసం బాధితులకు అండగా నేతలు




రాజీవ్‌నగర్, ప్రకాష్‌నగర్లలో మంచినీటి సమస్యపై ధర్నా చేస్తున్న సిపిఎం నేతలు (పాతచిత్రం)

ప్రజాశక్తి - విజయవాడ : సమాజంలో అణగారిన వర్గాలకు, అభాగ్యులకు ఆపద వస్తే ఏ సమయంలోనైనా, ఎక్కడైనా ముందుండేది ఎర్రజెండానే. ఓట్లతో సంబంధం లేకుండా, ప్రయోజనాలు ఆశించకుండా పేదల పక్షాన పోరాడేది కేవలం కమ్యూనిస్టులు మాత్రమే. ప్రజలకు ఏ సమస్య వచ్చినా వారి వెంట ఉంటూ ధైర్యాన్ని నింపుతూ ప్రజా గొంతుక వినిపించేది సిపిఎం నాయకులే... ప్రస్తుత ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రచార సరళి పూర్తిగా గాడి తప్పిన తరుణంలో విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో ఇండియా వేదిక బలపరిచిన సిపిఎం అభ్యర్థి చిగురుపాటి బాబూరావు వినూత్న ప్రచారం నిర్వహిస్తున్నారు. ప్రజల ఆలోచనను దారి మళ్లించి ఎన్నికల్లో లబ్ది పొందాలనే ఆలోచనతో గులకరాయి చుట్టూతే అధికార వైసిపి, టిడిపి అభ్యర్థులు, ఆ పార్టీ నేతల ప్రసంగాలు సాగుతున్నాయి. దీనికి భిన్నంగా ఇటీవల కాలంలో నియోజకవర్గ స్థాయిలో ఆయా తరగతుల ప్రజల కోసం నిర్వహించిన ప్రజా పోరాటాలు, వాటి విజయాలు, ప్రభుత్వాల నుంచి ఎదుర్కొన్న నిర్బంధాలు, కేసులు తదితర అంశాలను సిపిఎం నేతలు ప్రజల్లోకి తీసుకెళ్లి ఓటర్లను ఆలోచింప చేసే పనిలో నిమగ్నమయ్యారు. ఇటీవల కాలంలో సిపిఎం అభ్యర్థి చిగురుపాటి బాబూరావు, ఆ పార్టీలు నేతలు చేపట్టిన పోరాటాలను పరిశీలిస్తే...

రేషన్ కార్డుల ఉద్యమం

"తెల్లరేషన్ కార్డు" అంటేనే సిపిఎం అనే ఒక బ్రాండ్ ఆ పార్టీ ఉద్యమించిన ఘట్టాన్ని నియోజకవర్గంలోని పేదలు గుర్తు చేసుకుంటున్నారు. పేదలకు తెల్లరేషన్ కార్డులను మంజూరు చేయాలని నగర వ్యాప్తంగా 40 నుంచి 50 వేల మంది వరకు తరలి వచ్చి విజయవాడ గాంధీనగర్ తాలూకా సెంటర్‌లో గతంలో సిపిఎం ఆధ్వర్యంలో ఉవ్వెత్తున సాగిన ఉద్యమం ఫలితంగా దాదాపుగా నగర వ్యాప్తంగా ప్రజలకు రేషన్‌కార్డులు మంజూరు అయ్యాయని ఆనాటి జ్ఞాపకాలను సెంట్రల్ నియోజకవర్గం ప్రజలు గుర్తు చేసుకుంటున్నారు.

ఇళ్ల రిజిస్ట్రేషన్లు

దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉంటూ వస్తున్న వాంబేకాలనీ, రాజరాజేశ్వరీపేట ఏరియాల్లో పేదలుంటున్న ఏడెనిమిది వేల ఇళ్లకు రిజిస్ట్రేషన్ సదుపాయం కల్పించాలని సిపిఎం నిర్వహించిన పోరాటాల ఫలితంగా ఈ ఎన్నికల్లో ఎక్కడ ప్రజల నుంచి వ్యతిరేకత ఎదుర్కోవాల్సి వస్తుందనే భయాందోళనతో... ప్రస్తుత వైసిపి ఈ ఎన్నికల సమీపిస్తున్న తరుణంలో మొక్కుబడిగా... హడావుడిగా అన్నట్లు రెండు ప్రాంతాల్లో కేవలం ఐదారు వందల ఇళ్లకు మాత్రమే రిజిస్ట్రేషన్ చేయించినట్లు అధికారుల వివరాలు వెల్లడిస్తున్నాయి.

శ్మశాన స్థలాల అభివృద్ధి

చివరి మజిలీ అయిన దహన కార్యక్రమాలకు ఇబ్బందిగా ఉందని, స్మశాన స్థలాలను విస్తరించి, వాటిని అన్ని విధాలుగా అభివృద్ధి పరచాలని వాంబేకాలనీలోని హిందూ, ముస్లిం, క్రైస్తవ స్మశాన వాటికలను అభివృద్ధి పరచాలని సిపిఎం దశల వారీగా వివిధ రూపాల్లో ఆందోళనలు నిర్వహించిన పరిస్థితి ఉంది. దీనిలో భాగంగానే సింగ్‌నగర్... శాంతినగర్‌కు చెందిన ఆరుగురు విద్యార్థులు, యువకులు సూర్యలంక బీచ్‌కు వెళ్లడం, అక్కడ గల్లంతయిన నేపథ్యంలో ఆ శవాలను గుర్తించి,



ముంపునకు గురైన సింగ్‌నగర్ ప్రాంతంలో పర్యటిస్తున్న సిహెచ్.బాబూరావు (పాతచిత్రం)

ఇక్కడకు తీసుకొచ్చి దహన సంస్కారాలు చేయబోగా శ్మశాన స్థలాల్లోని రేకుల షెడ్లు దెబ్బతిని, జోరున వర్షంలో ఆ బాడీలు పూర్తిగా కాలకపోవడంతో...సంబంధిత బాధిత కుటుంబాల వారు సెంటిమెంట్‌గా ఆందోళనకు గురికాగా, వారికి మద్దతుగా సింగ్‌నగర్ ఏరియాలోని స్మశాన స్థలాలను బాగు చేయించాలని సిపిఎం ఆందోళనలు నిర్వహించింది. స్మశాన స్థలాలు బాగు చేయమని కోరినందుకు, సెంట్రల్ నియోజకవర్గం సిపిఎం అభ్యర్థి చిగురుపాటి బాబూరావు, నాయకులు భూపతి రమణారావు, కె దుర్గారావు, సిహెచ్ శ్రీను, తదితర 10 మందిని అరెస్ట్ చేసి, నందిగామ పోలీస్టేషన్‌కు తరలించిన వైనం ఈ ప్రాంతంలో ఆనాడు తీవ్ర సంచలనం సృష్టించింది. సూర్యలంక బీచ్‌లో గల్లంతయిన మృతుల కుటుంబాలను ఆదుకోవాలని బాధిత కుటుంబ సభ్యులతో పాటు సిపిఎం నాయకులు సుమారు మూడు మాసాల పాటు వివిధ రూపాల్లో ఆందోళనలు నిర్వహించగా, చేసేది లేక చివరకు ఒక్కొక్కరికి రూ. మూడు లక్షల చొప్పున రూ.18 లక్షలు ప్రభుత్వం ఆ కుటుంబాలకు సాయం అందించక తప్పలేదు.

ఇళ్ల పున:నిర్మాణానికి నిధులు కేటాయించాలని ఆందోళనలు

వర్షానికి కారిపోతూ...నీరు నిలబడి ఉండటానికి కూడా వీలు లేని దెబ్బతిన్న ఎల్‌బిఎస్ నగర్, పటేల్‌నగర్ ప్రాంతాల్లోని వందలాది గృహాలను పున:నిర్మించడానికి ఒక్కొక్క ఇంటికి రూ. ఐదు లక్షల చొప్పున నిధులు కేటాయించాలని బాబూరావు నేతృత్వంలో చేసిన పోరాటం నిర్వహించారు. ఎల్‌బిఎస్ నగర్ ఆరు వందలు, పటేల్ నగర్‌లో మరో ఏడు వందల గృహాలు దెబ్బతిని, శిథిలావస్థకు చేరిన గృహాలను బాగు చేయాలని అటు పేదలు, ఇటు సిపిఎం నేతలు వివిధ రూపాల్లో ఆందోళనలు చేస్తూనే వస్తున్నారు.

మంచినీటి సమస్యపై...

రాజీవ్‌నగర్, ప్రకాష్‌నగర్, పాయకాపురం తదితర ప్రాంతాల్లో గత 20 రోజుల నుంచి నీటి సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సిపిఎం చేసిన ఆందోళనల ఫలితంగా విఎంసి దిగి వచ్చి రూ. ఐదు లక్షలు వెచ్చించి, రెండు బోర్లు వేయించింది. అలాగే అన్యాక్రాంతమవుతున్న ఉడాకాలనీ స్థలాలకు రక్షణ కల్పించాలని సిపిఎం నేతలు పర్యటించి, అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

గుణదల ఫ్లైఓవర్ నిర్మాణ పనులు పూర్తి చేయాలని...

ట్రాఫిక్‌కు, రవాణాకు తీవ్ర ఇబ్బందులు పడుతూ గత 15 ఏళ్ల నుంచి మొండిగోడలకే పరిమితం అయిన గుణదల ఫ్లైఓవర్ నిర్మాణాన్ని పూర్తి చేయడంతో పాటు సింగ్‌నగర్ రెండవ ఫ్లైఓవర్ నిర్మాణాన్ని చేపట్టాలని, మధురానగర్, వాంబేకాలనీ ఆర్‌యుబిలు పూర్తి చేయాలని, కాలువలపై దెబ్బతిన్న బ్రిడ్జీల స్థానంలో కొత్త బ్రిడ్జీలు నిర్మించాలని దశల వారీగా సిపిఎం అనేక పోరాటాలు చేసింది. చివరకు అధికార వైసిపి ఎమ్మెల్యే మల్లాది విష్ణు గుణదల ఫ్లైఓవర్ నిర్మాణ పనులు ప్రారంభిస్తున్నట్లు ఎన్నికల ముందు కొంత హడావుడి చేసిన విషయం గమనార్హం.

నీటి మీటర్ల తొలగింపుపై...


నీటితో వ్యాపారం చేయరాదని, ఉచితంగా మంచినీటిని సరఫరా చేయాలని, భారంగా తయారయిన నీటి మీటర్లను తొలగించాలని సిపిఎం చేసిన పోరాటాల ఫలితంగా మధురానగర్‌లోని పసుపుతోటలో ఇళ్లకు బిగించిన సుమారు ఏడు వందల నీటి మీటర్లను విఎంసి అధికారులు బలవంతంగానైనా తొలగించక తప్పలేదు. అమృత్ స్కీమ్‌లో భాగంగా లక్ష మీటర్లు నగరంలోని ఆయా డివిజన్లలో బిగించాలని విఎంసి ప్లాన్ కాగా, సిపిఎం చేసిన ఆందోళనలు కారణంగా కొంత వెనుకంజ వేయక తప్పలేదు. ప్రస్తుతం నీటి మీటర్ల బిగించే అంశం తాత్కాలికంగా విఎంసి వాయిదా వేసుకోవాల్సి వచ్చింది.

పలు సమస్యలపై...

యువ క్రీడాకారులకు ఆటలాడుకునేందుకు స్టేడియాలు అందుబాటులోకి తీసుకురావాలని డివైఎఫ్ఐ, ఐద్వా తదితర సంఘాలు చేసిన పోరాటాల ఫలితంగా సింగ్‌నగర్ ఎంబి స్టేడియంను కొంత అభివృద్ధి చేయడం, క్రీడా సదుపాయాలు కల్పించడం జరిగింది. లైంగిక దాడుల నుంచి మహిళలకు రక్షణ కల్పించాలని, గంజాయి, మద్యం నుంచి యువతను కాపాడాలని కోరుతూ పాయకాపురం పోలీస్టేషన్ వద్ద ఐద్వా ఆధ్వర్యంలో ఇటీవల సుమారు 200 మంది మహిళలు ఆందోళన చేశారు. పోలీసులు దిగి వచ్చి మహిళలను వేధిస్తున్న ఐదుగురిని అరెస్ట్ చేయక తప్పలేదు. ఐద్వా ఆధ్వర్యంలో వాంబేకాలనీ, ఎల్‌బిఎస్ నగర్‌లో మహిళలు ఆందోళన చేశారు. ఎమ్మెల్యే మల్లాది విష్ణుకు సంబంధించిన నందమూరి నగర్‌లోని బ్రాందీషాపునుఇళ్ల మధ్యలో నుంచి ఎత్తి వేయించాలని మహిళలు ఆందోళనలు చేయడం, దానిపై ఎమ్మెల్యే వత్తిడి మేరకు ఐదుగురు మహిళలపై కేసులు బనాయించడం జరిగింది. సింగ్‌నగర్ శ్రీరామ్ ఎనర్జీ ప్లాంట్‌లో చెత్త డంపింగ్ చేయడాన్ని నిలుపుదల చేయాలని కొనేళ్ల తరబడి సిపిఎం, ఇతర ప్రజాసంఘాలు వివిధ రూపాల్లో పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహించిన కారణంగా ...ప్రస్తుతం ఇక్కడ చెత్త ట్రాన్స్‌ఫర్‌స్టేషన్‌గా మార్చివేసి, ఈ ప్రాంత ప్రజలకు కొంత ఉపశమనం కల్పించడం జరిగింది. వాహనాల ద్వారా సివిల్ సప్లై సరుకులు సరఫరా చేయడం వలను పూర్తి స్థాయిలో పేద ప్రజలకు అందడం లేదని, గతంలో మాదిరిగా చౌక డిపోల ద్వారానే సరుకు పంపిణీ చేయాలని ఐద్వా, డివైఎఫ్ఐ ఇతర సంఘాలు పెద్ద ఎత్తున సెంట్రల్ నియోజకవర్గంలో ఆందోళనలు చేశారు. సింగ్‌నగర్ వాంబేకాలనీలోని పది ఎకరాల ఐకానిక్ పార్కును పూర్తి చేయాలని, ప్లే ఐటమ్స్ అందుబాటులో ఉంచాలని డివైఎఫ్ఐ, ఐద్వా పార్కు వద్ద పలు రూపాల్లో ఆందోళనలు నిర్వహించారు.

ఎవరినైనా కొనేద్దాం...!

- డబ్బుల పంపకాల్లో వైసిపి, టిడిపి నేతలు..?



ప్రజాశక్తి - గన్నవరం : ఎన్నికల సమయం దగ్గరపడుతోంది. పోలింగ్‌కు 10 రోజుల సమయం మాత్రమే ఉంది. గన్నవరం నియోజకవర్గంలో కొంతమంది అభ్యర్థులు డబ్బు పంపిణీకి రంగం సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది. ఇప్పటికే కులాల వారీగా గుర్తింపు పొందిన నాయకులకు ప్యాకేజీలు ఇచ్చినట్లు సమాచారం. పార్టీల్లో చేరిక పేరుతో డబ్బు వెదజల్లుతున్నారు. వైసిపి, టిడిపి నేతలు గెలుపే లక్ష్యంగా నోట్ల పంపిణీకి శ్రీకారం చుట్టినట్లు తెలిసింది. వైసిపి ఇప్పటికే ప్యాకేజీల వారీగా పంపకాలను ప్రారంభించినట్లు తెలిసింది. ప్రధానంగా ఓటర్లను ప్రభావితం చేయగలిగే వ్యక్తులను గుర్తించి.. వారికి ప్యాకేజీ పంపిణీ పూర్తి చేసినట్లు ప్రచారం జరుగుతోంది. తమ పార్టీకి అనుకూలంగా ప్రచారం చేయాలని, చుట్టుపక్కల ఉన్న ఓటర్లను వైసిపికి ఓటు వేసేలా ప్రభావితం చేయాలని కోరుతూ నియోజకవర్గంలో ద్వితీయ శ్రేణి నాయకులకు రూ.20 వేల నుండి రూ.30 వేల వరకు పంపిణీ చేసినట్లు తెలుస్తోంది. టిడిపి నేతలు కూడా రహస్యంగా పంపిణీ కార్యక్రమాలు చేపట్టినట్లు ప్రచారం జరుగుతోంది. ఈసారి ఎలాగైనా గెలవాలని పట్టుదలతో డబ్బు పంపిణీ జోరు పెంచారని రాజకీయ పరిశీలకులు అంటున్నారు. ఈ రెండు పార్టీల వద్ద డబ్బులు తీసుకుని వ్యవహారాలు నడుపుతున్న కొందరు నేతల పరిస్థితి మూడు పువ్వులు ఆరు కాయలు అన్నట్లుగా ఉంది. ప్రచారం పేరుతో, మీటింగుల పేరుతో వేలకు వేలు చేతులు మారుతున్నట్లు తెలిసింది. అభ్యర్థుల వద్ద లక్షలు తీసుకుని జనానికి మాత్రం కొద్దిగా పంపిణీ చేసి మిగిలింది జేబులో వేసుకుంటున్నారని కొందరు బహిరంగంగా ఆరోపిస్తున్నారు. నియోజకవర్గంలో అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడు నియోజకవర్గంలోని కొన్ని రంగాలకు చెందిన వ్యక్తులను గుర్తించి.. వాళ్లందరికీ వేలల్లో పంపిణీ పూర్తిచేసినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా ప్రార్థనా సంస్థల నిర్వాహకులు, వివిధ రంగాలకు చెందిన వ్యక్తులను ప్రభావితం చేయగలిగే వారిని, గ్రామంలోని కుల పెద్దలను గుర్తించి ఒక్కొక్కరికి వేలకు వేలు పంచుతున్నట్లు సమాచారం. పోలింగ్‌కు ముందు రోజు ఓటర్లకు పంపిణీ చేసేందుకు డబ్బులు సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. ఈనియోజకవర్గంలో గెలుపును అధికారపార్టీ ప్రతిష్టాత్మ కంగా తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ ఎన్నికల్లో ఓడిపోతే తమకు రాజకీయ ప్రాధాన్యత తగ్గుతుందనే ఆలోచనతోనే ఎంత డబ్బు ఖర్చుపెట్టేందుకైనా వెనుకాడటంలేదని సమాచారం. ఇక టిడిపి నాయకులు... వైసిపి నేతల కంటే ఎక్కువ ఇస్తారని ప్రచారం జరుగుతోంది. నీతివంతమైన రాజకీయాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి వారిని చైతన్యపరిచే కార్యక్రమాన్ని, ఆలోచించి ఓటు వేయాలనే ప్రచారాన్ని ఎర్రజెండా చేపడుతోంది.

ఎన్నికల పుణ్యం !!

- తోపుడు బండ్లపై ఉచితంగా అల్పాహారం



ప్రజాశక్తి - తిరువూరు : సార్వత్రిక ఎన్నికల పుణ్యమాని తిరువూరు పట్టణంలోని మెయిన్ రోడ్డు మసీదు సెంటర్‌తో పాటు పలు ప్రాంతాల్లో తోపుడు బండ్లపై గత వారం రోజులుగా అల్పాహారం ఉచితంగా సరఫరా చేస్తున్నారు. ఒక్కో బండికి రోజుకు రూ.3,500 చొప్పున ఎన్నికలలో పోటీచేస్తున్న ఒక రాజకీయ పార్టీ అభ్యర్థి చెల్లిస్తున్నట్లు సమాచారం. ఇటీవల విడుదలైన 10వ తరగతి పరీక్షల్లో 500 మార్కులకు పైగా సాధించిన విద్యార్థులకు అదే రాజకీయ పార్టీకి చెందిన అభ్యర్థి రూ.10 వేల చొప్పున నగదు ప్రోత్సాహకాలు ఇస్తున్న సంగతి కూడా పట్టణంలో హాట్ టాపిక్‌గా మారింది. పదో ఉత్తీర్ణులైన విద్యార్థుల తల్లిదండ్రులు ఆ అభ్యర్థి ఇంటి వద్ద క్యూ కడుతున్నారు. వివిధ సామాజిక సంఘాలు ఎన్నికల సందర్భంగా ఆ అభ్యర్థి నుండి పెద్దమొత్తంలో లబ్ది పొందుతున్న ట్లు కూడా ప్రచారం జరుగుతోంది. ఒక సామాజికి వర్గానికి రూ.15 లక్షలు, మరో సామాజిక వర్గానికి రూ.10 లక్షలు, ఇలా ఓ ప్రధాన పార్టీ అభ్యర్థి నగదు బహుమతి ప్రకటిస్తున్నట్లు జోరుగా ప్రచారం సాగుతోంది. ఎన్నికల ప్రచారానికి వెళ్లినప్పుడు ఆ అభ్యర్థికి ఎదురేగి హారతులిస్తున్న ఒక్కో మహిళకు రూ.500 ఇస్తున్నారని తెలిసింది. పలు సామాజిక వర్గాలకు చెందిన కమ్యూనిటీ భవనాల నిర్మాణాలకు ఆ అభ్యర్థి స్థలాలను కొనుగోలు చేసి ఇస్తున్నట్లు ప్రచారం జోరుగా జరుగుతుంది. ఇంత ఖర్చు చేస్తున్న అభ్యర్థికి ఎన్నికల్లో ఏ మేరకు ఉపయోగం కలుగుతుందో వేచి చూడాలి.

ఉల్లిపాలెంలో విస్తృత ప్రచారం

ప్రజాశక్తి-కోడూరు : ఉల్లిపాలెం గ్రామ అభివృద్ధి ప్రదాత మండలి బుద్ధప్రసాద్ అని గ్రామంలో రోడ్లన్నీ సిసి రోడ్లు వేయించి ,గ్రామాన్ని స్మార్ట్ విలేజ్ గా తీర్చిదిద్దిన ఘనత మండలి బుద్ధ ప్రసాద్‌దేనని ఆయన కోడలు మండలి సాయి సుప్రియ అన్నారు. శుక్రవారం అవనిగడ్డ నియోజకవర్గ ఎన్డీయే కూటమి అభ్యర్థి మండలి బుద్ధ ప్రసాద్, మచిలీపట్నం పార్లమెంట్ అభ్యర్థి వల్లభనేని బాలశౌరి విజయాన్ని ఆకాంక్షిస్తూ సాయి సుప్రియ ఉల్లిపాలెం గ్రామంలో విస్తత ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గాజు గ్లాస్ గుర్తుపై రెండు ఓట్లు వేసి మండలిని ,వల్లభనేని అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి,జనసేన బిజెపి నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

హామీలను విస్మరించిన

బిజెపికి బుద్ధి చెప్పాలి

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి-ఉంగుటూరు : దేశ భవిష్యత్తుకు, దేశ వినాశనానికి మధ్య ప్రస్తుత ఎన్నికలు జరుగుతున్నాయని,ఈ ఎన్నికల్లో ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి. ఉమామహేశ్వరరావు అన్నారు. శుక్రవారం మండలంలోని పెద్దావుటపల్లి, తేలప్రోలు తదితర గ్రామాలలో సిపిఐ, కాంగ్రెస్ ,ఆమ్ ఆద్మీ పార్టీలు బలపరిచిన ఇండియా వేదిక గన్నవరం నియోజకవర్గ సిపిఎం అభ్యర్థి కళ్ళం వెంకటేశ్వరరావు, మచిలీపట్నం పార్లమెంటు కాంగ్రెస్ అభ్యర్థి గొల్ల కృష్ణ వామపక్షాల కార్యకర్తలతో కలిసి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ 2014లో అధికారంలోకి రావడానికి బిజెపి ప్రజలకు అనేక రకాలుగా హామీల వర్షం కురిపించిందని, అధికారం చేపట్టిన తర్వాత వాటిని విస్మరించిందని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన నాటి నుండి నిరంతరం నిత్యవసరాల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని, ప్రభుత్వ రంగ సంస్థలు ప్రైవేట్ పరం అవుతున్నాయని, ఇస్తానన్న ఉద్యోగాలు గాలిలో కలిసిపోయాయని దుయ్యబట్టారు. ఎన్నికలు తరుముకొస్తున్న నేపథ్యంలో రామ భజన చేస్తూ అయోధ్య రామమందిరం ప్రారంభించారని, ఈ విధమైన మాయాజాలంతో అదికారంలోకి రావాలనే ప్రయత్నం చేస్తున్న బిజెపికి ప్రజలు తగిన బుద్ధిచెప్పాలన్నారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం నిరంతరం కషి చేస్తున్న సిపిఎం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై. వెంకటేశ్వరరావు, సిపిఎం జిల్లా కార్యదర్శి వై నరసింహరావు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు టి వి లక్ష్మణస్వామి, మండల పార్టీ కార్యదర్శి అజ్మీరా వెంకటేశ్వరరావు, మండల పార్టీ నాయకులు పాల్గొన్నారు.




ప్రచారంలో పాల్గొన్న వి.ఉమామహేశ్వరరావు, వై.వెంకటేశ్వరరావు

కాల్వగట్ల వాసులకు అండగా నిలిచిన

బాబురావుకే మా ఓటు

- ప్రచారంలో నేతలకు స్థానికుల వెల్లడి
- వైసిపి, టిడిపి, బిజెపిలకు ఓటు ద్వారా బుద్ధి చెప్పాలి
- ప్రచారంలో నేతల పిలుపు



ప్రచారం నిర్వహిస్తున్న బాబురావు

ప్రజాశక్తి-విజయవాడ : విజయవాడ నగర పరిధిలోని కాలువ కట్టల వాసులకు రక్షణ కల్పించి పోరాటం నడిపింది సిపిఎం నేతృత్వంలో బాబురావు అని, అనేక త్యాగాలు, నిర్బంధాలు, కేసులను ఆయన ఎదుర్కొన్నారని, ప్రస్తుతం జరుగుతున్న ఈ ఎన్నికల్లో ఆయనను గెలిపించుకోవాల్సిన కర్తవ్యం కాలువ కట్టల వాసులపై ఉందని పలువురు నివాసులు పేర్కొన్నారు. 26వ డివిజన్ మాచవరం, మారుతి నగర్, కాలవకట్టలు తదితర ప్రాంతాల్లో ఇండియా వేదికబలపర్చిన సిపిఎం సెంట్రల్ నియోజకవర్గం అభ్యర్థి సిహెచ్.బాబురావు, కాంగ్రెస్ నేత వి. గురునాథంతో కలిసి శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యకర్తలు సుత్తి, కొడవలి గుర్తుతో కూడిన గొడుగులతో వినూత్న రీతిలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం అభ్యర్థి చిగురుపాటి బాబూరావు మాట్లాడుతూ...బిజెపి, వైసిపి, తెలుగుదేశం పార్టీల విధానాలతో భవిష్యత్తులో ప్రమాదం పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. దేశాన్ని, రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిన పాలకుల విధానాలు ప్రజల పాలిట శాపాలుగా మారనున్నాయన్నారు. విజయవాడ రైల్వే స్టేషన్ తో సహా రైల్వేను లీజు పేరుతో ప్రైవేట్ వారికి దారా దత్తం చేస్తున్నారని దుయ్యబట్టారు. కేంద్రంలోని బిజెపి-మోడీ పాలనలో రాజ్యాంగానికే ముప్పు ఏర్పడుతుందని, రిజర్వేషన్లకు ప్రమాదం వాటిల్లుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో మోడీ ప్రభుత్వాన్ని గద్దె దించాల్సిన కర్తవ్యం ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు.ప్రజల కోసం నిరంతరం పని చేసే నేతలను శాసనసభకు పంపాలని, అప్పుడే నిజాయితీ నిలబడుతుందని అన్నారు. కాంగ్రెస్ నాయకులు గురునాథం మాట్లాడుతూ కాలువ కట్టల వాసులకు రక్షణ కల్పించి పోరాటం నడిపింది సిపిఎం అని అన్నారు. అందుకే కాల్వకట్టల వాసులందరూ మూకుమ్మడిగా బాబురావుకు ఓటు వేయాలని, ఇల్లు నిలబెట్టిన బాబురావు, సిపిఎం పట్టాలు ఇప్పిస్తారని అన్నారు. ఈ ప్రచార కార్యక్రమంలో సిపిఎం నాయకులు జి నటరాజ్, వై. సుబ్బారావు, కాజా సరోజ, పి.మురహరి, నరసింహారావు, రవీంద్ర , గురుమూర్తి, లక్ష్మణ పాల్గొన్నారు.

సిపిఎం ద్వారానే అభివద్ధి సాధ్యం

సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు కే శ్రీదేవి

ప్రజాశక్తి-అజిత్‌సింగ్‌నగర్ : విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం 63వ డివిజన్‌లోని రాజీవ్ నగర్ , ఎల్ బి ఎస్ నగరలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు కే శ్రీదేవి గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇండియా వేదిక సిపిఐ, కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ, సిపిఎం ఎమ్మెల్యే అభ్యర్థి చిగురుపాటి బాబురావు విడుదల చేసిన మేనిఫెస్టో ఆమోదియోగంగా ఉందన్నారు. విజయవాడను మారుద్దాం, చెత్త పన్ను రద్దు చేయడం, ఆస్తి విలువ ఆధారంగా ఇంటి పన్ను విధించే చట్టం రద్దు, ఇంటి పన్నులు తగ్గింపు, నీటి మీటర్లు నిలిపివేయడం,డిస్నీల్యాండ్ స్థలంలో కబేలా ప్రతిపాదన రద్దుచేసి ఆ స్థలాన్ని ఇళ్ల స్థలాలకు కేటాయించటం, ప్రజా ప్రయోజనాల వినియోగించడం వంటి కార్యక్రమాలు చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ఇంచార్జ్ నిర్మల జగన్ పి సాంబి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భళే చిత్రాలు



ఎండకు విరుగుడు...!!!

ఎండకు విరుగుడు...అవును ఇది ఎండకు విరుగుడే...! ఒకపక్క భానుడి భగభగతో జనం బయటకు వచ్చేందుకు భయపడుతున్నారు. మరోపక్క రాజకీయ వేడి బయటకు వచ్చేలా చేస్తోంది..!! దీంతో ఎండ తీవ్రత నుండి ఎలాగైనా బయటపడాలనే ఉద్దేశంతో వినూత్న ఆలోచన చేస్తున్నారు కొందరు. ఈ నేపథ్యంలోనే ఇటు ఎండ తీవ్రతను తట్టుకునేందుకూ, అటు వినూత్న ప్రచారం చేసేందుకు కొత్త ఆలోచన చేశారు. సిపిఎం విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ అభ్యర్థిగా రంగంలోకి దిగిన సిహెచ్ బాబురావు సిపిఎం, సిపిఐ సింబల్స్ ముద్రించిన ఎర్రని గొడుగులు వేసుకుని ముందుకు సాగడం అందరినీ ఆకర్షించింది.

నేటి నుండి కెబిఎన్లో పోస్టల్ బ్యాలెట్

ప్రజాశక్తి - వన్‌టౌన్ : ఈ నెల 13న జరగనున్న రాష్ట్ర అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో సంబంధిత విధుల్లో ఉండేవారు, ఇతరుల సౌకర్యార్థం 4వ తేదీ నుండి 6వ తేదీ వరకూ కొత్తపేటలోని కెబిఎన్ కాలేజీలో పోస్టల్ బ్యాలెట్ సదుపాయం కల్పించినట్లు వెస్ట్ అసెంబ్లీ రిటర్నింగ్ ఆఫీసర్ కిరణ్మయి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా ఎన్నికల అధికారి, యన్.టి.ఆర్. జిల్లా కలెక్టర్ ఆదేశాల ప్రకారం రిటర్నింగ్ ఆఫీసర్, 79-విజయవాడ వెస్ట్ అసెంబ్లీ నియోజక వర్గంలో 4వ తేదీ నుండి 6 వరకు పిఓ, ఏపిఓ, ఓపిఓఎంఓ, పోలీస్, ఎన్‌సిసి, ఎన్ఎస్ఎస్, డ్రైవర్స్, సెక్టార్ ఆఫీసర్స్, ఇతరులకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించు నిమిత్తం విజయవాడ కొత్తపేటలోని కేబిఎన్ కాలేజీ నందు ఫెసిలిటేషన్ సెంటర్ ఏర్పాటు చేశామని, ఎలెక్షన్ డ్యూటీలో ఉన్న అందరూ ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించు కోవాలని వెస్ట్ రిటర్నింగ్ ఆఫీసర్ కిరణ్మయి తెలిపారు.

టిడిపిలో చేరిన ఎంపిపి అనుచరులు

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : రెడ్డిగూడెం మండలంలో మండల పరిషత్ అధ్యక్షురాలు రామినేని దేవి ప్రవీణ్య వీరస్వామి నాయడు, తన భర్త వైసిపి సీనియర్ నాయకుడు రామినేని వీరస్వామినాయుడు, మరో సీనియర్ నేత రామినేని వెంకటేశ్వరరావు తన అనుచరులతో 50 మందితో టిడిపిలో చేరారు. బూరుగగూడెంలో ఎంపిపి ఇంటి నుంచి ర్యాలీగా మైలవరం వెళ్లి టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి వసంత వెంకట కృష్ణ ప్రసాదు, మాజీ మంత్రి జోహార్‌ల సమీక్షంలో టిడిపిలో చేరారు.

దుర్గమ్మను దర్శించుకున్న రావత్

ప్రజాశక్తి - వన్‌టౌన్ : శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం దుర్గమ్మ అమ్మవారి దర్శనార్థం ఆలయానికి రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ రావత్, ఆర్థిక శాఖ కార్యదర్శి కె.వి.వి. సత్యనారాయణ శుక్రవారం ఆలయానికి విచ్చేశారు. వీరికి ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి శ్రీ అమ్మవారి దర్శనం కల్పించారు. అనంతరం వీరికి వేదపండితులు వేదాశీర్వచనం చేయగా ఆలయ అధికారులు శ్రీ అమ్మవారి ప్రసాదంలు, శేషవస్త్రం అందజేశారు.

శ్రీమహాలక్ష్మి దేవస్థానంలో చీరలు వేలం

ప్రజాశక్తి - వన్‌టౌన్ : చిట్టినగర్‌లో వేంచేసియున్న శ్రీ మహాలక్ష్మి అమ్మవార్ల దేవస్థానంలో అమ్మవారికి భక్తులచే సమర్పించిన చీరలు, జాకెట్లు వేలంపాట ఈ నెల 3, 4 తేదీల్లో రెండు రోజుల పాటు నిర్వహించనున్నట్లు దేవస్థాన కార్యదర్శి మరుపిళ్ళ హనుమంతరావు తెలిపారు. ఈ సందర్భంగా 3వ తేదీ శుక్రవారం ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు దేవాదాయ ధర్మాదాయశాఖ వారి ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ యన్.అరుణ ఆధ్వర్యంలో బహిరంగ వేలంపాట నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు విరివిగా పాల్గొన్నారు. పాట పాడిన వారు రుసుం చెల్లించి రశీదులు పొందినట్లు దేవస్థాన కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా దేవస్థాన అధ్యక్షులు లింగిపిల్లి అప్పారావు మాట్లాడుతూ తిరిగి 4వ తేదీ శనివారం ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు బహిరంగ వేలంపాట జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన కార్యదర్శి మరుపిళ్ళ హనుమంతరావు, కోశాధికారి పిళ్ళా శ్రీనివాసరావు (పిసి), పిళ్ళా విజయ్ కుమార్, ఈది ఎల్లారావు, గూడేల రామకష్ణ (ఆర్కే) తదితరులు పాల్గొన్నారు.



అలుపెరగకుండా ప్రచారం

వాంబే కాలనీలో చిగురుపాటి బాబురావు సతీమణి ప్రచారం

ప్రజాశక్తి - అజిత్ సింగ్‌నగర్ : ఇండియా కూటమి బలపరిచిన సిపిఎం ఎమ్మెల్యే అభ్యర్థి చిగురుపాటి బాబూరావు సతీమణి చిగురుపాటి సునంద సెంట్రల్ నియోజకవర్గం 60వ డివిజన్ వాంబేకాలనీలో శుక్రవారం పర్యటించారు. కాలనీలో ఇంటింటికి తిరిగి స్థానికులకు సిపిఎం అభ్యర్థి చిగురుపాటి బాబూరావు ప్రజల కోసం పోరాడే వ్యక్తిని పిలిస్తే పలికే వ్యక్తిని విజయవాడ అభివృద్ధి కోసం పోరాడే వ్యక్తిని నిత్యం ప్రజల్లో ఉండే పోరాడే యోధుడని విజయవాడ అభివృద్ధి కోసం నిత్యం పోరాడే నాయకుడని వాంబే కాలనీలో చేసిన పోరాటాల గురించి వివరించారు అన్ని ప్రాంతాల అభివృద్ధి చెందాలన్నా అన్ని వర్గాల ప్రజలకు ఉజ్వల భవిష్యత్తు అందించాలన్న ప్రతి ఒక్కరూ కమ్యూనిస్టులకు ఓటు వేసి ఎమ్మెల్యే అభ్యర్థులను అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ఇంచార్జ్ రత్నకుమారి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

62వ డివిజన్లో నేతల ప్రచారం

సార్వత్రిక ఎన్నికల్లో సుత్తి కొడవలి నక్షత్రంపై ఓట్లు వేసి సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని 62వ డివిజన్ ప్రకాష్ నగర్ డివిజన్ ఇన్‌ఛార్జ్ ఎన్.నాగేశ్వరరావు అన్నారు. 62వ డివిజన్ ప్రకాష్ నగర్ ఇంటింటికి వెళ్లి కరపత్రాలు అందజేశారు. పార్టీ సభ్యులు బి.రాము, జమలయ్య, పున్నయ్య, కామేశ్వరి ఆటో యూనియన్ నాయకులు చిన్ని తదితరులు పాల్గొన్నారు

52వ డివిజన్‌లో వైసిపి అభ్యర్థి ఆసీఫ్ ప్రచారం

ప్రజాశక్తి - వన్‌టౌన్ : పశ్చిమ నియోజకవర్గ ఎన్నికల్లో ప్రచారం భాగంగా శుక్రవారం 52వ డివిజన్. మల్లికార్జునపేట ఇన్‌ఛార్జ్ తంగిళ్ళ పూర్ణచంద్రరావు (రాము) ఆధ్వర్యంలో కొండ ప్రాంతాల్లో నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్ ప్రతి గడపకు వెళ్లి జగన్మోహన్ రెడ్డి ఇస్తున్న సంక్షేమ పథకాలను అందుతున్నాయా లేక ఏమన్నా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ప్రజలందరూ వాలంటరీ వ్యవస్థ మీద ప్రతిపక్షాలు చేస్తున్న కుట్రను దుమ్మెత్తిపోస్తున్నారు.

వైసిపి అభ్యర్థి నల్లగట్ల ప్రచారం

ప్రజాశక్తి.- తిరువూరు : వైసిపి తిరువూరు నియోజకవర్గ అభ్యర్థి నల్లగట్ల స్వామిదాస్ శుక్రవారం తిరువూరు పట్టణంలోని 10,11 వార్డుల్లో ఎన్నికల ప్రచారాన్ని విస్తృతంగా నిర్వహించారు. ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వార్డు కౌన్సిలర్లతో కలిసి ఇంటింటికి వెళ్లి జగన్ ప్రభుత్వంలో వస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ తాను గెలిస్తే తిరువూరు అభివద్ధికి కృషి చేస్తానని స్వామిదాస్ హామీ ఇచ్చారు.

ఇండియా వేదిక అభ్యర్థి ప్రచారం

ప్రజాశక్తి - వత్సవాయి : జరగబోయే ఎన్నికల్లో బిజెపి బలపరిచిన టిడిపి అభ్యర్థిని, వైసిపి అభ్యర్థిని ఓడించి కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని ఇండియా వేదిక ఎమ్మెల్యే అభ్యర్థి కర్నాటి అప్పారావు, సిపిఎం సీనియర్ నాయకులు చిరుమామిళ్ల హనుమంతరావు అన్నారు. శుక్రవారం మండలంలోని వత్సవాయి, వేముల నర్వ, కాకరవాయి, మాచినేని పాలెం, తాళ్లూరు, నందిగామ మండలంలో గొల్లమూడి, రుద్రవరం, సోమవారం, తొర్రగుంట పాడు, మాగల్లు తదితర గ్రామాల్లో ప్రచార యాత్ర కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రూ.2 లక్షలు రైతు రుణమాఫీ చేయనున్నట్లు ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక హోదా కోసం పది సంవత్సరాలు జరుగుతుందని తెలిపారు. ప్రతి పేద విద్యార్థి చదువుకోటానికి ఒకటో తరగతి పోస్ట్ గ్రాడ్యుటీ వరకు ఉచిత విద్య అందించనున్నట్లు తెలిపారు. ప్రతి పేద కుటుంబానికి ఒక మహిళకు నెలకు రూ.8333 లు బ్యాంకు ఖాతాలో జమ చేయనున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే మరలా దేశ ఆర్థిక అభివద్ధి చెందుతుందని ప్రాజెక్టులు పూర్తవుతాయని అన్నారు. నిరుద్యోగ సమస్య పరిష్కార అవుతుందని పేర్కొన్నారు. సిపిఎం మండల కార్యదర్శి తమ్మినేని రమేష్, సిపిఎం నాయకులు తమ్మినేని రాంబాబు, పెంటి కోటేశ్వరరావు, జగ్గయ్యపేట, వత్సవాయి, పెనుగంచి ప్రోలు మండల అధ్యక్షులు ఎర్ర కుమారస్వామి, కొమ్మినేని నాగేశ్వరరావు, నల్లజాల ధనంజయులు, బ్లాక్ వన్ అధ్యక్షులు సనే రామారావు, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు అన్ని పాక వెంకటేశ్వర్లు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ప్రభాకర్ రావు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థి తాయ్య ప్రచారం

జగ్గయ్యపేట : ప్రచారంలో భాగంగా మండలంలోని బండిపాలెం, గుండబోయినపాలెం, పోచంపల్లి గ్రామలలో టిడిపి, బిజెపి, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలతో కలిసి ఎన్టీఆర్ జిల్లా టిడిపి అధ్యక్షులు నెట్టెం శ్రీ రఘురామ్, విజయవాడ పార్లమెంట్ కూటమి అభ్యర్థి కేశినేని శివనాథ్ చిన్ని, జగ్గయ్యపేట నియోజకవర్గం కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీరాం రాజగోపాల్ తాతయ్య గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

శ్రీరామ్ సతీమణ శ్రీరాం శ్రీదేవి ప్రచారం

వందశాతం హామీలు అమలు చేస్తా రాష్ట్రంలో దశల వారిగా మద్యం నిషేధించి, ఓట్లు అడుగుతానని మాట ఇచ్చిన జగన్మోహన్ రెడ్డి మాట తప్పాడనీ, ఇచ్చిన హామీలు అమలు చేయలేదని, మద్యం నిషేధం సంగతి గలికొదిలేశడనీ కూటమి అభ్యర్థి శ్రీరాం రాజగోపాల్ తాతయ్య సతీమణి శ్రీరాం శ్రీదేవి అమ్మాజీ అన్నారు. పట్టణంలోని 31వ వార్డు టీచర్స్ కాలనీ, విష్ణుప్రియ నగర్‌లో శ్రీరాం శ్రీదేవి ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

జగనన్న పాలనలో ఇంటి వద్దకే పాలన

మళ్లీ వైసిపిని గెలిపించుకుంటేనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను కుమార్తె పద్మ ప్రియాంక అన్నారు. పట్టణంలోని ఆర్టీసీ కాలనీలో ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి అందించిన సంక్షే మాన్ని వివరిస్తూ ప్రభుత్వవిప్, శాసనసభ్యులు సామి నేని ఉదయభాను నియోజకవర్గంలో చేసిన అభి వృద్ధిని తెలియపరుస్తూ ఉదయభాను సోదరీమణి బేబీ, కుమార్తె పద్మ ప్రియాంక, కోడలు కావ్య ఎన్నికల ప్రచా రాన్ని నిర్వహించారు.

రైతుకు అండగా నిలిచింది జగనే...

విత్తు నుంచి విక్రయం దాకా అన్నదాతకు వెన్నుదన్నుగా నిలిచి వ్యవసాయాన్ని పండుగ చేసిన ఏకైక ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మాత్రమేనని విమలభాను ఫౌండేషన్ చైర్మన్ సామినేని విమలభాను అన్నారు. పట్టణంలోని స్థానిక రైతు బజార్ నందు ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి అందించిన సంక్షేమాన్ని వివరిస్తూ ప్రభుత్వ విప్, స్థానిక శాసనసభ్యులు సామినేని ఉదయ భాను చేసిన అభివృద్ధిని తెలియపరుస్తూ ఉదయభాను సతీమణి సామినేని విమలభాను ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు.

బాబు అధికారంలోకి వస్తే కరువే !

జగ్గయ్యపేట: చంద్రబాబు అధికారంలోకి వస్తే రాష్ట్రంలో కరువు తప్పదని ప్రభుత్వవిప్, శాసనసభ్యులు సామినేని ఉదయభాను అన్నారు. మండలంలోని తక్కెళ్ళపాడు, అనుమంచిపల్లి గ్రామాలలో ప్రభుత్వవిప్, శాసనసభ్యులు సామినేని ఉదయభాను ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఉదయభాను మాట్లాడుతూ 2014లో చంద్రబాబు మోసాలను తెలుసుకున్న ప్రజలు 2019 ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డిని గెలిపించారని తెలిపారు. మండలంలోని గండ్రాయి గ్రామంలో శుక్రవారం రాత్రి ప్రభుత్వ విప్, స్థానిక శాసనసభ్యులు సామినేని ఉదయభాను ఎన్నికల ప్రచారం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గండ్రాయి గ్రామస్తులు ఉదయభానుకు అపూర్వ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సామినేని ఉదయభాను మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి జరగాలంటే మరల ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్మోహన్ రెడ్డి రావాలని కోరారు.

ఇండియా వేదిక అభ్యర్థి బొర్రా కిరణ్ ప్రచారం

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : ఎన్టీఆర్ జిల్లా, మైలవరం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఇండియా వేదిక అభ్యర్థిగా కమ్యూనిస్టు పార్టీలు బలపరిచిన కాంగ్రెస్ పార్టీ మైలవరం అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి బొర్రా కిరణ్ సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పివి.ఆంజనేయులుతో కలిసి తన ఎన్నికల ప్రచారాన్ని రెండో విడత రెడ్డిగూడెం మండలంలో ప్రారంభించారు. శుక్రవారం ఓబులాపురం, నరుకుళ్ళపాడు, రుద్రవరం, కుదప, కూనపరాజుపర్వ, శ్రీరాంపురం, ముచ్చినపల్లి గ్రామాల్లో కొనసాగింది. ఈ సందర్భంగా జరిగిన బహిరంగ సభల్లో వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే ఇండియా వేదిక ప్రభుత్వం రావాలని అన్నారు. ప్రత్యేక హోదా, రాజధాని, విశాఖ ఉక్కు, యువతకు ఉపాధి, ఉద్యోగాలు రావాలంటే ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించాలని కోరారు. అలాగే ఇంటింటికీ తిరిగి హస్తం గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇండియా వేదిక అభ్యర్థి గెలుపు కోసం ఎర్రజెండా - మూడు రంగుల జెండా చూపరులను ఆకట్టుకుంటూ ఆలోచింపజేసేలా ఉంది. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు మద్దిరెడ్డి మాధవరెడ్డి, కృష్ణారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గొడవర్తి వెంకటేశ్వరరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.



జగ్గయ్యపేటల ప్రచారంలో సామినేని కుటుంబం



సింగ్‌నగర్‌లో బాబూరావు గెలుపునకు ప్రచారం



వత్సవాయిలో ఇండియా వేదిక అభ్యర్థి ప్రచారం



జగ్గయ్యపేటలో టిడిపి అభ్యర్థి ప్రచారం

వైసిపి అభ్యర్థి సర్నాల ప్రచారం

అన్నేరావుపేట, సీతారాంపురం, శ్రీరాంపురం, ముచ్చినపల్లి గ్రామాల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మైలవరం నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి సర్నాల తిరుపతిరావు తన ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు.

సౌమ్య ప్రచారం

ప్రజాశక్తి - వీరులపాడు : మండల పరిధిలోని జగన్నాథపురం గ్రామంలో ఎన్నికల ప్రచారంలో మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పాల్గొన్నారు. నరసింహారావు పాలెం పొన్నవరం బోడవాడ జమ్మవరం గోకరాజు పల్లి ఎల్లంకి గ్రామాల్లో ఎన్నికల ప్రచారంలో భాగంగా విస్తతంగా గ్రామాల్లో పర్యటించి జనసేన, బిజెపి, టిడిపి అభ్యర్థి తంగిరాల సౌమ్యను గెలిపించాలని ఓటర్లను కోరారు. **ప్రజాశక్తి - వీరులపాడు :** రంగాపురం, తిమ్మాపురం గ్రామాల్లో ప్రతి ఇంటికి తిరుగుతూ డాక్టర్ మొండితోక జగన్ మోహన్‌రావు ప్రచారం నిర్వహించారు.

అభివద్ధి చూసి ఓటేయండి : మొండితోక

ప్రజాశక్తి - కంచికచర్ల : గడచిన 5 ఏళ్ల లో మంచి చేశానని అనిపిస్తేనే ఓటు వేయండని వైసిపి అభ్యర్థి , సిట్టింగ్ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్మోహన్ రావు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం రాత్రి మండలంలోని కొత్తపేట గ్రామంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా రోడ్ షో నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .గత పాలకులు అభివద్ధిని పక్కన బెట్టి సామంతరాజుల కనుసన్నల్లో ప్రజాధనాన్ని లూఠీ చేశారన్నారు. వైసిపి ప్రభుత్వ హయాంలో ఇచ్చిన హామీలతో పాటు ఎన్నో ఏళ్లగా పరిష్కారం కాని సమస్యలను కూడా పరిష్కారించామన్నారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి

మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గం ఎన్నికల అధికారి ఎం.వాణి

ప్రజాశక్తి - కలక్టరేట్ (కష్ణా) : 75-మచిలీపట్టణం అసెంబ్లీ నియోజకవర్గంలో ఓటు హక్కు కలిగి ఫారం 12 దరఖాస్తు చేసిన వారందరూ నోబుల్ కాలేజ్, మచిలీపట్నం నందు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన (ఫెసిలిటేషన్ సెంటర్)లో కౌంటర్లలో తమ ఓటు హక్కును ఈ క్రింది తెలిపిన తేదీలలో వినియోగించుకోవాలని మచిలీపట్నం అసెంబ్లీ నియోజక వర్గం, రెవెన్యూ డివిజనల్ అధికారి, ఎం.వాణి ప్రకటనలో తెలిపారు. నేడు అనగా శనివారం పిఒలు, ఏపీవోలు, మైక్రో అబ్జర్వర్లకు 5 ఆదివారం ఓపిఓలకు, 6 వ తేదీ సోమవారం పోలీస్ సిబ్బంది, ఎసెన్షియల్ సర్వీసెస్, ఎన్‌సిసి, ఆర్ఒ స్టాఫ్, మెడికల్ సిబ్బంది వినియోగించుకోవాలన్నారు. ఏదైనా కారణములతో ఓటు హక్కును వినియోగించుకోని వారు 7వ తేదీన -మచిలీపట్నం రిటర్నింగ్ అధికారి వారి కార్యాల యం, మచిలీపట్నంలో ప్రత్యేకంగా కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కావున ఫారం -12 దరఖాస్తు చేసిన వారందరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.



విద్యార్థికి సాయం అందజేస్తున్న దృశ్యం

అధిక మార్కులు సాధించిన విద్యార్థికి ఆర్థికసాయం

ప్రజాశక్తి- తిరువూరు : కొలికపూడి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు పదో తరగతి ఫలితాల్లో 600 మార్కులకు గానూ 500 లకు పై మార్కుల వచ్చిన విద్యార్థులకు ఎన్‌అర్‌ఐ అనుమోలు సత్య నారాయణ చేతుల మీదగా గంపలగూడెం మండలం దుందిరాలపాడు గ్రామంలో శుక్రవారం ఆర్థికసాయం అందజేసినట్లు టిడిపి సోషల్ మీడియాలో ఆ పార్టీ నాయకులు పేర్కొన్నారు. కాలసాని మౌనిక, చప్పిడి సాయికిరణ్, కోరే అశ్విని, తేనేటి లీలవర్ధిని, అడెపు నవీన్ కుమార్, చప్పిడి మహిమలకు రూ.10 వేలు చొప్పున ఆర్థిక సహాయం అందచేశారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగు యువత అధ్యక్షుడు మానుకొండ రామకృష్ణ, నియోజకవర్గ బిసి సెల్ ప్రధాన కార్యదర్శి వాకదని శ్రీనివాసరావు, పార్టీ గ్రామ అధ్యక్షుడు కళ్యాణం కృష్ణయ్య పాల్గొన్నారు.

తెలుగు యువత సమావేశం

ప్రజాశక్తి - విసన్నపేట : విస్సన్నపేట స్థానిక కాకతీయ కమ్మ సేవాసమితి కల్యాణమండపంలో టీడీపీ అభిమానులతో తెలుగు యువత నియోజకవర్గ స్థాయిలో యువగళం సమావేశం వేర్పాటు చేసారు. ఈ కార్యక్రమం లో తిరువూరు నియోజకవర్గం కూటమి అభ్యర్థి కొలికిపూడి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రంలో ఇప్పటివరకు అంతటి సాఫ్ట్ వేర్ లేక యువతకు సరైన ఉపాధి లేదని మళ్లీ చంద్రబాబుని మనందరం గెలిపించుకునే బాధ్యత మనకు ఉందని అన్నారు. అప్పుడు మాత్రమే ఆంధ్ర రాష్ట్రంలో మరో హైటెక్ సిటీ నిర్మితమవుతుందని యువతకు ఎన్నో ఉద్యోగాలు అవకాశాలు వస్తాయని అన్నారు. ఎన్నారైలు అందరూ కూడా టిడిపి కూటమి తరుపున చంద్రబాబును గెలిపించుకోవాలని ఆకాంక్షించారు.

ముస్లిం ద్రోహులను తరిమికొట్టాలి

ప్రజాశక్తి - వన్‌టౌన్ : ముస్లింలకు అన్యాయం చేసే ముస్లిం ద్రోహులను తరిమికొట్టాలని వైసిపి లోక్‌సభ అభ్యర్థి కేశినేని నాని అన్నారు. వైసిపి మైనార్టీ సెల్ రాష్ట్ర నేత అబ్దుల్ వాహబ్ ఆధ్వర్యంలో పాతబస్తీలోని మాడపాటి క్లబ్ ఆవరణలో ముస్లింల ఆత్మీయ సమ్మేళనం శుక్రవారం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపి కేశినేని నాని మాట్లాడుతూ బిజెపికి కొమ్ముకాస్తున్న ముస్లిం ద్రోహులను తరిమికొట్టాలన్నారు. తాను పార్లమెంట్‌లో ముస్లిం మైనార్టీలకు మద్దతుగా ఉన్నానని, ఎప్పుడూ వారికి వ్యతిరేకంగా తాను వ్యవహరించలేదన్నారు. ముస్లిం మైనార్టీలకు గడిచిన పదేళ్ల కాలంలో తాను అండగా ఉన్నానని వివరించారు. సుజనాచౌదరికి మద్దతుగా నరేంద్రమోదీ ప్రచారం చేస్తే పశ్చిమ నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి షేక్ ఆసిఫ్‌కు 30 వేల మెజార్టీ ఖాయమన్నారు. షేక్ ఆసిఫ్ మాట్లాడుతూ పశ్చిమ నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా పని చేసిన మైనార్టీ నేత నేడు బీజేపీకి ఓటు వేయాలని కోరడటం సిగ్గుచేటన్నారు. పోతిన మహేష్ మాట్లాడుతూ లోకల్ వ్యక్తి షేక్ ఆసిఫ్‌కు విజయవాడ పశ్చిమ నియోకవర్గం యావత్ మద్దతుగా ఉందన్నారు. ఎక్కడ నుంచో వచ్చి బీసీలు, అట్టడుగ వర్గాల కష్టాన్ని దోచుకున్న సుజనాచౌదరి వంటి ఆర్థిక నేరగాళ్లను పశ్చిమ ప్రజలు తరిమికొట్టాలన్నారు. ఈ కార్యక్రమానికి 54వ డివిజన్ కార్పొరేటర్ అబ్దుల్ ఆర్షద్ అధ్యక్షత వహించగా, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, రాష్ట్ర కార్యదర్శి జీఎంసీ బాషా, జిల్లా వక్ఫ్‌బోర్డు ఛైర్మన్ షేక్ గౌస్‌మొహిద్దీన్, షేక్ బాషి, కార్పొరేటర్లు ఎండీ ఇర్ఫాన్, చలపతిరావు, వివిధ సంఘాల అధ్యక్షులు, పాల్గొన్నారు.



మండలి బుద్ధ ప్రసాద్ ప్రచారం

నాగాయలంకలో బుద్ధప్రసాద్ ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి - అవనిగడ్డ : అవనిగడ్డ నియోజకవర్గం జనసేన పార్టీ అభ్యర్థి మండలి బుద్ధ ప్రసాద్ మచిలీపట్నం పార్లమెంటు జనసేన పార్టీ అభ్యర్థి వల్లభనేని బాలశౌరి తనయుడు అనుదీప్‌తో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొలుత సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ర్యాలీగా బయలుదేరి నాగాయలంక పురవీధుల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు అనంతరం ప్రధాన కూడలిలో సమావేశం నిర్వహించారు.

కాపులకు మేలు చేయని వ్యక్తి ముద్రగడ

ప్రజాశక్తి - అవనిగడ్డ : రాష్ట్రంలో కాపు కులానికి ఏ విధమైన మేలు చేయని వ్యక్తి ముద్రగడ పద్మనాభం అని కాపు తెలగ బలిజ దక్షిణ భారత జేఏసీ కన్వీనర్ దాసరి రాము తెలిపారు. శుక్రవారం టిడిపి బిజెపి బలపరిచిన జనసేన పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మండలి బుద్ధ ప్రసాద్‌ను కలిసి సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ ఆనాడు ఎసిసి ప్రతినిధి సీఎం అవకాశమిస్తామని వస్తే రాజశేఖర్ రెడ్డి సీఎం చేయాలని సిఫారసు చేసిన ముద్రగడ పద్మనాభం ఏనాడూ కాపులకు మేలు చేయలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ కాపులకు ముస్లింలకు రిజర్వేషన్లు ఇస్తామని ప్రకటించినప్పుడు ముద్రగడ పద్మనాభం కాపు రిజర్వేషన్లు ఎందుకు సాధించలేదన్నారు రాజశేఖర్ రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు ఏనాడు కాపు రిజర్వేషన్లు ప్రస్తావన తేలేదన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు చిలకలపూడి పాపారావు గుడివాక శేషుబాబు మర్రే గంగయ్య టిడిపి నాయకులు కొల్లూరి వెంకటేశ్వరరావు, మెగావత్ గోపి పాల్గొన్నారు.



మండలిని కలిసిన కార్యకర్తలు



మైలవరంలో పులిహోర, కంచికచర్లలో మజ్జిగ పంపిణీ చేస్తున్న దృశ్యం

మజ్జిగ, పులిహోర పంపిణీ

ప్రజాశక్తి - మైలవరం : మండలంలోని వెల్వడం లక్కిరెడ్డి పాపులమ్మ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల 1987- 92 సంవత్సరాల్లో 6 నుండి 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల సహకారంతో శుక్రవారం వెల్వడం మెయిన్ సెంటర్లో మజ్జిగ, పులిహోరను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన లక్కిరెడ్డి పుల్లారెడ్డి (యు.ఎస్.ఎ) మాట్లాడుతూ వేసవిలో ప్రజల దాహార్తి తీర్చేందుకు పూర్వ విద్యార్థులు సంఘంగా ఏర్పడి మజ్జిగ పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. పూర్వ విద్యార్థుల సంఘం నాయకుడు గూడూరు నాగిరెడ్డి మాట్లాడుతూ 1200 మందికి పైగా మజ్జిగ పులిహోర అందజేశామన్నారు. సహకరించిన దాతలు విజయ్ కష్ణ సుదీర్ దంపతులను అభినందించారు. **కంచికచర్ల :** గత కొద్దిరోజులుగా కంచికచర్ల ప్రాంతంలో ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో కంచికచర్ల వాసవి యువసేన, ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో బస్టాండ్ ఎదురుగా పమిడిమర్రి రాజా(శివ), షాపు వద్ద మజ్జిగ పంపిణీ చేపట్టారు. కోత్తూరి శ్రీనివాసరావు వివాహ మహోత్సవ సందర్భంగా శుక్రవారం మజ్జిగ పంపిణీ జరిగింది. జూలూరు విశ్వనాథం, కొప్పు ప్రసాద్, జల్లా శీను, గుండా వెంకటేశ్వరరావు, గుండా రాము, పమిడిమర్రి పవన్, చందులూరి శ్రీకాంత్, దొడ్డా మహేష్ , వేములపల్లి ఈశ్వర్, దివ్వెల అనుదీప్, వాసవి యువసేన, ఆర్యవైశ్య సోదరులు పాల్గొన్నారు.

బైకు డివైడర్‌ను ఢీకొని వ్యక్తి మృతి

జగ్గయ్యపేట: బైక్ డివైడర్ ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన తెలంగాణ రాష్ట్రం కట్టంగూర్ వద్ద మండలంలోని మల్కాపురం గ్రామానికి చెందిన వ్యక్తి మృతి చెందాడు. మల్కాపురం గ్రామానికి చెందిన సోంపొంగు నాగేశ్వరరావు (30) హైదరాబాదులో వాచ్‌మెన్‌గా పని చేస్తున్నాడు తన స్వగ్రామం మల్కాపు రానికి బైక్‌పై కుమార్తె మనీషాను తీసుకొని వస్తుం డగా కట్టంగూర్ వద్ద బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో నాగేశ్వరరావు అక్కడికక్కడే మతి చెందాడు. కుమార్తె మనిషాకు స్వల్ప గాయాలయ్యాయి. మతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.



భార్య రాజ్యం ఫిర్యాదు మేరకు కట్టంగూర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని కట్టంగూర్ ప్రభుత్వ హాస్పటల్‌కు తరలించి పోస్టుమార్టం నిర్వహించి అనంతరం బంధువులకు అప్పగించారు.

మల్కాపురం గ్రామంలో విషాద ఛాయలు

మల్కాపురం గ్రామానికి చెందిన సొంపొంగు ఏసు కుమారుడు నాగేశ్వరావు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడతో మల్కాపురం గ్రామంలో విషాదఛాయాలు అలుముకున్నాయి. ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందటంతో ఆ కుటుంబం విషాదంలో మునిగింది.

15వ డివిజన్లో అవినాష్ పర్యటన

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : విజయవాడ తూర్పు నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ ఫార్టీ ఎంఎల్ఎ అభ్యర్థి దేవినేని అవినాష్ శుక్రవారం 15వ డివిజన్‌లోని రామలింగేశ్వరనగర్ కాలువ గట్టు ప్రాంతాలలో పర్యటించారు. వైసిపి ప్రభుత్వంలో చేసిన అభివృద్ధి గురించి స్థానికులకు తెలియచేశారు. అలాగే కాలువ గట్టు ప్రాంత వాసులు వర్షం వచ్చినా లేదా వరదలు వచ్చినా తీవ్ర ఇబ్బందులు పడేవారని అటువంటి వారి కోసం కరకట్ట నిర్మాణం వైసిపి ప్రభుత్వ హాయంలో చేసినట్లు స్థానికులకు తెలియచేశారు. రానున్న ఎన్నికలలో కూడా వైసిపిని గెలిపించి మరింత అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈకార్యక్రమంలో డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

బ్యాంకుల వద్ద పడిగాపులు



మైలవరంలో బ్యాంకు వద్ద పడిగాపులు

ప్రజాశక్తి - అజిత్ సింగ్‌నగర్ : పింఛను కష్టాలు రెండో రోజూ తప్పలేదు. అవ్వ తాతలు, వికలాంగులు, వితంతువులు పింఛనుదారులంతా తీవ్ర అవస్థ పడుతూ తెల్లవారుజామునే బ్యాంకుల వద్దకు చేరుకొని క్యూలో నిలబడి నానా ఆగచాట్లు పడ్డారు. పెన్షన్ డబ్బులు బ్యాంకులో జమైన కారణంగా డబ్బులను తీసుకునేందుకు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రతి నెల ఏ కష్టం లేకుండా వాలంటీర్ల ద్వారా ఇంటి వద్దే పింఛన్ మొత్తం అందుకున్న లక్షలాదిమంది ఈసారి కొత్తగా బ్యాంకు నుండి తీసుకోవాలంటే అష్టకష్టాలు పడ్డారు. రెండు రోజులుగా బ్యాంకుల చుట్టూ తిరుగుతూ ఒక వైపు డబ్బులు అందక, మరో వైపు ఎండతీవ్రతతో ఇబ్బందులు పడుతున్నారు. ప్రకాష్ నగర్ యూనియన్ బ్యాంకు ముందు వృద్ధులు, వికలాంగులు తాగటానికి నీళ్లు లేక, వేలిముద్రలు పడక కొంతమంది, సరైన సమాచార మిచ్చేవారు లేక కొన్ని చోట్ల ఇబ్బందులు తప్పలేదు.

పింఛన్ల కోసం తప్పని తిప్పలు

ప్రజాశక్తి - మైలవరం : పింఛన్ కోసం పెన్షన్ దారులు పడరాని పాట్లు పడుతున్నారు. రెండో రోజైన శుక్రవారం కూడా మైలవరంలోని సెంట్రల్ బ్యాంక్, ఎస్బిఐ వద్ద పలువురు ఉదయం 9 గంటలకే చేరుకొని ఎండను సైతం లెక్కచేయకుండా క్యూలో నుంచున్నారు. వృద్ధులు నిలబడే ఓపిక లేక నేలపైనే కూర్చున్నారు. గంటలు తరబడి నిలబడటంతో కొంతమంది వృద్ధులు అసౌకర్యానికి గురయ్యారు. తీరాఅధికారుల వచ్చి బ్యాంకు గేటుతాళాలు తీసిన తర్వాత గుంపులుగా నెట్టుకుంటూ లోపలికి వెళ్లడంతో కొంతమంది వద్దులు కింద పడ్డారు. 10, 15 కిలోమీటర్ల దూరం నుండి రావాల్సి వస్తుందని తాగేందుకు మంచినీళ్లు కూడా దొరకటం లేదని పలువురు వాపోయారు.



గంపలగూడెంలో పింఛన్ అందజేస్తున్న దృశ్యం



సింగ్‌నగర్‌లో బ్యాంకులో వృద్ధురాలి అవస్థలు

చికిత్స పొందుతున్న బాధితురాలికి పెన్షన్ అందజేత

ప్రజాశక్తి - గంపలగూడెం : మండలంలోని చింతల నర్వ గ్రామానికి చెందిన వజ్రగిరి కమలమ్మ (వికలాంగురాలు) ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ, విజయవాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఆమెకు గ్రామ వ్యవసాయ శాఖ సహాయకులు కె.పున్నయ్య విజయవాడ వెళ్లి చికిత్స పొందుతున్న కమలమ్మకు పింఛన్ అందజేశారు.

వేద పాఠశాల పరిశీలన


విద్యార్థుల సమస్యలు తెలుసుకుంటున్న దుర్గగుడి ఇఓ రామారావు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వారి దేవస్థానం ఆధ్వర్యంలో పోరంకిలో ఉన్న శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వారి దేవస్థానం వారి స్మార్త వేద పాఠశాలను ఆలయ కార్యనిర్వాహణాధికారి కె.ఎస్ రామారావు శుక్రవారం సందర్శించి, క్షేత్రస్థాయిలో పరిశీలన చేశారు. ఈ సందర్భంగా వేద పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న వేద విద్య, వసతులు, మరమ్మత్తులు, శానిటేషన్ మొదలగు ఏర్పాట్లు గురించి పాఠశాల ప్రధానోపాధ్యాయుల వారితో, వేద పాఠశాల సిబ్బంది వారితో కలిసి వేదపాఠశాలను క్షేత్ర స్థాయి లో పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం, వేసవి సందర్భంగా వేద విద్యార్థులకు సౌకర్యార్థం వేద పాఠశాలలో తరగతి గదులు, రూములలో ఏర్పాటు చేసిన కూలర్లు, ఫ్యాన్లు, చలువ పందిళ్ళు, శానిటేషన్ తదితర ఏర్పా ట్లు ఎలా ఉన్నాయో పరిశీలన చేశారు. కోర్సు పూర్తి చేసుకో బోతున్న వేద విద్యార్థులకు ఆలయ పురాణ పండిట్ సి.హెచ్. వెంకటేశ్వర శాస్త్రి ప్రాక్టికల్ తరగతులపై శిక్షణ ఇచ్చారు. కార్య నిర్వాహణాధికారి వారితో పాటుగా వేద పాఠశాల ప్రధానో పాధ్యాయులు, సిబ్బంది, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రధానికి వినతిపత్రం ఇచ్చేందుకు సహకరించాలని
చంద్రబాబుకు ఆకుల బహిరంగ లేఖ

ప్రజాశక్తి - భవానీపురం : ఈ నెల 8న ఎన్నికల ప్రచారం కోసం ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ విజయవాడ వస్తున్న సందర్భంగా ఆయనకు ఏపీ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌పై ఒక రిప్రజెంటేషన్ ఇవ్వడంకోసం పర్మిషన్ ఇప్పించాలని మాజీ సీఎం చంద్రబాబుకు వైసీపీ రాష్ట్ర కార్యదర్శి ఆకుల శ్రీనివాసకుమార్ శుక్రవారం ఒక బహిరంగ లేఖ రాశారు. ఆ లేఖలో చంద్రబాబు, పవన్ కళ్యాణ్ గత రెండు రోజులుగా రాష్ట్రంలో అనేక చోట్ల ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ గురించి ప్రజలను తప్పుదారి పట్టించేలా ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. తమ నాయకులు, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మా రాష్ట్ర ప్రభుత్వానికీ ఆ జీఒతో సంబంధం లేదని, అది కేంద్ర ప్రభుత్వం తెచ్చిన జీఓ అని వివరణ ఇస్తున్నా వారు తమ రాజకీయ ప్రయోజనాలు కోసం పదేపదే గోబెల్స్ ప్రచారం చేస్తున్నారని ఆకుల విమర్శించారు. రాష్ట్రంలో నిరు పేదలైన అక్కా చెల్లెమ్మలకు సుమారు లక్ష ఎకరాల భూమిని సేకరించి ఇళ్లు కడుతున్న విషయం వారికి తెలియదా? ఇంకో పక్క భూమి లేని పేద రైతులకు సాగుకోసం వేలఎకరాలు భూమి పంపిణీ చేసిన విషయం వారికి కనిపించక పోవడం ఏమనుకోవాలి అని మండిపడ్డారు. పూలింగ్ పేరిట రాజధాని కడుతున్నానని అమరావతి ప్రాంతంలో రైతుల నుంచి బలవంతంగా భూములు తీసుకునీ దాని ద్వారా రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసిన చరిత్ర వారిది అనే విషయం ప్రజలు మర్చిపోలేదన్నారు. ఆ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ మీద నిజనిజాలు ప్రజలకు తెలియ చేయవలసిన బాధ్యత తమకు ఉందన్నారు. ఈ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ గురించి మోడీతో వాస్తవాలు తెలియ చేయవలసిందిగా కోరుచున్నామని ఆ లేఖలో పేర్కొన్నారు.

తిరుపతమ్మను దర్శించుకున్న ఎసిపి దంపతులు



పెనుగంచిప్రోలు : స్థానిక శ్రీ తిరుపతమ్మ అమ్మ వారిని నందిగామ డివిజన్ ఏసిపి రవి కిరణ్, దంపతులు కుటుంబ సమేతంగా శ్రీ తిరుపతమ్మ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కుబడులు తీర్చుకున్నారు. ఆలయ అధికారులు స్వాగతం పలికి అర్చకులు వేద పండితులచే వేద ఆశీర్వచనం చేసి శేష వస్త్రములు తీర్థ ప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రాంబాబు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

15మంది చిన్నారులకు ఉచితంగా గుండె ఆపరేషన్లు

హిలింగ్ లిటిల్ హార్ట్స్, యుకె ఛారిటీ సౌజన్యంతో ఆంధ్రా హాస్పిటల్స్‌లో విజయవంతంగా పూర్తి

ఆంధ్రా హాస్పిటల్ ఎమ్‌డి డాక్టర్ పి.వి.రామారావు వెల్లడి



సర్జరీ చేయించుకున్న చిన్నారులతో వైద్యులు

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ : ఆంధ్రా హాస్పిటల్స్, హీలింగ్ లిటిల్ హార్ట్స్, యుకె ఛారిటీ సౌజన్యంతో ఆంధ్రా హాస్పిటల్స్‌లో ఉచితంగా 15మంది పిల్లలకు గుండె ఆపరేషన్లు విజయవంతంగా నిర్వహించినట్లు హాస్పిటల్ ఎమ్‌డి డాక్టర్ పీవీ రామారావు తెలిపారు. శుక్రవారం ఉదయం ఆంధ్ర హాస్పటల్స్ హార్ట్ అండ్ బ్రెయిన్ ఇన్సిట్యూట్‌లో యూకెకు చెందిన కార్డియాక్ సర్జన్ ఆండ్రూ పారీ పీడియాట్రిక్, బ్రిస్టల్, యుకె, డాక్టర్ డొరొతి లిడ్ బెటర్, కన్సల్టెంట్ పీడియాట్రిక్ కార్డియాక్ ఇంటెన్సివిస్ట్ డాక్టర్ ఒజిత్ బెనర్జీ, పిడియాట్రిక్ కార్డియాక్ ఇంటెన్సివిస్ట్, కోచరని సెబాస్టియన్, హెలీ ఫిట్జ్ పాట్రిక్, అలెగ్జాండ్రా టేలర్, బ్రిస్టల్ తదితరులతో కలిసి డాక్టర్ పీవీ రామారావు మాట్లాడుతూ, యుకె నుంచి ఇక్కడకు వచ్చిన వైద్యులు హార్ట్ అండ్ బ్రెయిన్ ఆంధ్ర హాస్పిటల్‌లో కార్డియాక్ సర్జన్ సాయిరామ్‌తో కలిసి 29వ ఉచిత పిల్లల గుండె సర్జరీలు క్యాంపులో భాగంగా ఏప్రిల్ 29వ తేదీ నుంచి మే 4వ తేదీ వరకు నిర్వహించిన క్యాంపులో 15మంది చిన్నారులకు ఉచితంగా గుండె ఆపరేషన్లు విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. యుకె వైద్యులు గడచిన 9 సంవత్సరాల నుంచి 29సార్లు ఆంధ్ర హాస్పిటల్స్‌కి వచ్చి తమ వైద్యులతో కలిసి నెలకు 50 నుంచి 60 ఆపరేషన్లు చొప్పున ఏడాదికి 600 ఆపరేషన్లు విజయవంతంగా చేశారని అందులో భాగంగా ఇప్పటి వరకు 4వేల వరకు పిల్లల గుండె సర్జరీలు, ఇంటర్వెన్షన్స్ చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుండి రోగులు తమ వద్దకు వస్తున్నారని, అతి క్లిష్టమైన గుండె జబ్బులకి కూడా ఆపరేషన్లు విజయవంతంగా చేశామని తెలిపారు. ఆంధ్ర హాస్పిటల్స్, హీలింగ్ లిటిల్ హార్ట్స్, యూకె డాక్టర్లు, నర్సులు వైద్య బందానికి కృతజ్ఞతలు తెలిపారు. విలేకరుల సమావేశంలో ఆంధ్రా హాస్పిటల్స్ నుంచి పిల్లల కార్డియాలజిస్ట్ విక్రమ్, పిల్లల కార్డియాక్ సర్జన్లు సాయిరామ్, నాగేశ్వరరావు, శ్రీమన్నారాయణ, సీనియర్ కార్డియాలజిస్ట్, డాక్టర్ రమేష్, కార్డియాక్ ఎన్ స్తిటిస్ట్, డాక్టర్ రేవంత్, పిల్లల కార్డియాక్ ఇంటెన్సివిస్ట్ తదితరులు పాల్గొన్నారు.

ఐపిఎల్ వేడుకలకు ఏర్పాట్లు

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ : ప్రస్తుతం ఐపీఎల్ (ఇండియన్ ప్రీమియర్‌లీగ్) క్రికెట్ పోటీలు జరుగుతున్నందున ప్రతి ఒక్కరూ వేడుకలు చేసుకునే విధంగా నగరంతో పాటు వివిధ ప్రాంతాలలో ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహణ కమిటీ సభ్యులు ప్రతాప్ ఒక ప్రకటనలో తెలిపారు. సాదారణంగా విజయోత్సవ వేడుకలు ఒక్కొక్క చోట ఒక్కో విధంగా జరుగుతాయని తెలిపారు. ఇందులో భాగంగా విజయోత్సవాలను ఆయా జట్లను బట్టి వారి సంప్రదాయాలచు అనుగుణంగా వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. అంతే కాకుండా ఈవేడుకలను ప్రతి ఒక్కరూ తిలకించేందుకుగాను వివిధ ప్రాంతాలలో కమ్యూనిటీ స్క్రీనింగ్‌లు, వాహనాలలో ప్రత్యేక స్క్రీనింగ్ వంటి సదుపాయాలను కూడా ఏర్పాటుచేసినట్లు తెలిపారు వేసవిలో ప్రతి ఒక్కరూ క్రికెట్‌ను వీక్షించేలా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

పోలింగ్ సజావుగా జరగాలి



ప్రజాశక్తి కలక్టరేట్ (కష్ణా) : భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పార్లమెంటు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ నియోజకవర్గాలకు ఈ నెల 13వ తేదీ పోలింగ్ జరగనున్న దృష్ట్యా ఎన్నికలను శాంతియుతంగా, స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా, న్యాయ సమ్మతంగా నిర్వహించేందుకు పోలింగ్ సజావుగా జరిగేలా చూడడానికి, సంఘ వ్యతిరేక శక్తుల జోక్యాన్ని అరికట్టడానికి, సిఆర్ పి.సి 144 సెక్షన్ కింద ఈనెల 11వ తేదీ నుండి కృష్ణా జిల్లాలో పోలింగ్ ప్రక్రియ పూర్తయ్యే వరకు నిషేధ ఆజ్ఞలు జారీ చేస్తూ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ & జిల్లా మేజిస్ట్రేట్ శ్రీ డీకే బాలాజీ ఉత్తర్వులు జారీ చేశారు. దీని ప్రకారం ఐదుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది వ్యక్తులు గుమికూడడాన్ని నిషేధించడంతో పాటు అన్ని రకాల కర్రలను తీసుకెళ్లడాన్ని నిషేధిస్తూ సెక్షన్ 144(2) సిఆర్ పిసి కింద ఉత్తర్వులు జారీ చేశారు. పేలుడు ఆయుధాలు లేదా ఏదైనా ఇతర ఆయుధాలు, రాళ్లు మొదలైనవి, మొత్తం కష్ణా జిల్లా అధికార పరిధిలోని పార్లమెంటు, ఆంధ్రప్రదేశ్ శాసనసభకు సాధారణ ఎన్నికల కోసం ఏర్పాటుచేసిన అన్ని పోలింగ్ స్టేషన్ల వద్దకు తీసుకెళ్లడాన్ని నిషేధించారు. 2024 సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి పోలింగ్ ముగిసే సమయానికి 48 గంటల ముందు బహిరంగ సభలు, ఊరేగింపులు, అన్ని రకాల ప్రచారాలు నిషేధించబడ్డాయని జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు. ఈ ఉత్తర్వులు కృష్ణాజిల్లాలో ఈ నెల 11 నుండి పోలింగ్ పూర్తయ్యే వరకు అమలులో ఉంటాయని జిల్లా ఎన్నికల అధికారి ఉత్తర్వులో పేర్కొన్నారు.

కల్వర్ట్ దిమ్మెను మార్చరూ!


పగిలిపోయిన కల్వర్ గుంతలో ఇరుక్కుపోయిన ద్విచక్ర వాహనం

ప్రజాశక్తి - వన్‌టౌన్ : కల్వర్ట్‌పై వేసిన దిమ్మె పగిలిపోయి ప్రమాదకరంగా మారి ఆ గొయ్యిలో ద్విచక్ర వాహనదారులు పడిపోయి గాయాలపాలు అవుతున్నా పట్టించుకున్న నాథుడు లేదని పలువురు వాహనదారులు వాపోతున్నారు. వివరాల్లోకి వెళ్తే నిత్యం రద్దీగా ఉండే వన్‌టౌన్‌లోని శంకర్ కేఫ్ సెంటర్‌లో ప్రధాన రహదారిపై గత కొంతకాలంగా డ్రైన్‌పై వేసిన కల్వర్ దిమ్మె ఒకటి పగిలిపోయి పెద్ద గుంత ఏర్పడింది. దీంతో రద్దీగా ఉండే ఆ రోడ్డులో ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహన చక్రాలు ఇరుక్కుపోయి పడిపోయి తీవ్ర గాయాలపాలు అవుతున్నారు. రాత్రి సమయం అయితే చాలు మరింత మంది కాలిబాటన నడిచే వారితో పాటు వాహనదారులు పడిపోతున్నారు. ఈ నెల 3వ తేదీ శుక్రవారం రాత్రి సమయంలో ఓ ద్విచక్ర వాహనదారుడు అటుగా ప్రయాణిస్తూ పగిలిపోయిన గొయ్యిలో తన వాహనం ఇరుక్కుపోవటంతో వెంటనే అక్కడున్న సిఐటియు పశ్చిమ సిటీ అధ్యక్షుడు వెంకట్రావు (చౌదరి) ద్విచక్ర వాహనం వ్యక్తిని పడిపోకుండా కాపాడారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు రద్దీగా ఉండే వన్‌టౌన్ శంకర్ కేఫ్ సెంటర్‌లో రోడ్డుకు మధ్యలో పగిలిపోయిన కల్వర్ దిమ్మెను మార్చి ప్రమాదాలు నివారించాలని కోరారు.

వేసవి క్రికెట్ శిబిరం ప్రారంభం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : పట్టణంలోని ఈ నెల 3 నుండి 31 వరకు నిర్వహించనున్న సమ్మర్ క్రికెట్ క్యాంప్‌ను మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎం.రవి కుమార్, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ పి.జె.సురేష్ కుమార్ చేతుల మీదగా నెట్ 1, 2లను ప్రారంభించారు. బి.వి.సాగర్ స్పోర్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కోచ్ రాజేంద్ర పర్యవేక్షణలో సీనియర్, జూనియర్ క్రీడాకారులు, జానీ, సుధీర్, అనురాగ్ పాల్గొన్నారు.


బాధితురాలు కోటేశ్వరి

ఎన్‌టిటిపిఎస్
కోల్ ప్లాంట్లో ప్రమాదం

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : ఎన్‌టిటిపిఎస్ కోల్ ప్లాంట్‌లో శుక్రవారం ప్రమాదం జరిగింది. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో బొగ్గు వ్యాగన్లు ఢీకొని జూపూడికి చెందిన సునావత్ కోటేశ్వరి (34) ఎస్టి మహిళా కార్మికురాలు రెండు కాళ్లు పూర్తిగా విరిగి పోవడంతో వైద్యం కోసం విజయవాడ ఎన్నారై హాస్పిటల్‌కు స్థానికులు తరలించారు. ఈ విషయం బయటకు రాకుండా ఎన్‌టిపిఎస్ అధికారులు గోప్యంగా ఉంచారు. అధికారుల నిర్లక్ష్యం, పర్యవేక్షణ లోపం వల్లే పలు ప్రమాదాలు సంభవించి వివిధ లోకేషన్లలో కాంట్రాక్టు కార్మికులు బలవుతున్నారని, కొద్దికాలం క్రితం ఇదేవిధంగా ప్రమాదం జరిగి ఇబ్రహీంపట్నానికి చెందిన కాంట్రాక్టు కార్మికుడు మృతిచెందాడు. ఎన్‌టిటిపిఎస్ అధికారులు ఇప్పటికీ గుణపాఠం నేర్చకుండా పదే పదే కార్మికులను బలి తీసుకుంటున్నారని కార్మిక సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఎన్‌టిటిపిఎస్‌లో ప్రమాదాలకు యాజమాన్యమే పూర్తి బాధ్యత వహించాలని, అధికారులు, కాంట్రాక్టర్లు నిర్లక్ష్యం వలననే ప్రమాదాలు జరుగుతున్నాయని, బాధితురాలికి న్యాయం చేయాలని కుటుంబీకులు డిమాండ్ చేస్తున్నారు.

హిమాలయ ఎలక్ట్రోలైట్స్
నూతన ఉత్పత్తి ఆవిష్కరణ

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : వేసవి సందర్భంగా రీ హైడ్రేషన్, అలసటను ఎదుర్కొనేందుకుగాను ప్రముఖ వెల్‌నెస్ బ్రాండ్ హిమాలయ ఆధ్వర్యంలో ఎలక్ట్రోలైట్ ఎనర్జీ డ్రింక్‌ను మార్కెట్లోకి తీసుకువచ్చినట్లు సంస్థ మార్కెటింగ్ ప్రతినిధి కె.ఎం.ఎస్.రావు తెలిపారు. ఈ సందర్భంగా ఎనర్జీ శక్తి డ్రింక్‌ను పరిచయం చేసేందుకుగాను నగరంలోని ఓ హోటల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో వివరాలను తెలిపారు. యాపిల్, ఆరెంజ్ రుచులతో సరికొత్తగా రూపొందించినట్లు తెలిపారు. ఇటీవల కాలంలో ఎండ తీవ్రత రోజు రోజుకూ పెరుగుతుందని అయితే చాలా మంది తీవ్ర అలసటకు గురవుతున్నారని అటువంటి వారికి ఎనర్జీ శక్తిని అందించేందుకు రీ హైడ్రేట్ ఎలక్ట్రోలైట్స్ ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. హిమాలయ రీ హైడ్రేట్ డ్రింక్ ద్వారా శరీరానికి ముఖ్యమైన పోషకాలు వేగంగా అందుతాయని తెలిపారు. అదనంగా యాంటి ఆక్సిడెంట్లు అధికంగా ఉండే ఉసిరి, దానిమ్మ వంటి సూపర్‌ఫ్రూట్స్ మిశ్రమం కూడా ఉంటుందని తెలిపారు.